ENTERED KSR02B111C

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మార్చి 06, 2016

అయ్యారే... అసామాన్యులు..







లియోనార్డోలో ఇద్దరు

తొలి అకాడెమీ అవార్డును అందుకుంటూ లియోనార్డో డికాప్రియోలోని ఇద్దరు మాట్లాడారు. ఒకరు అవార్డులతో కొలవలేని అద్భుత నటుడు, మరొకరు ప్రకృతంటే ప్రాణమిచ్చే పర్యావరణ వేత్త. 23 ఏళ్లుగా అతడి చేతుల్లో ఒదిగిపోదామని ఆస్కార్ స్టాట్యూనే ఎదురుచూసినట్టు అనిపిస్తుంది. ఎందుకంటే ఆస్కార్‌కు అతడి పేరు నామినేట్ అయ్యి ఇది ఆరోసారి. అది ఎప్పటికీ అందదని జోక్‌లెన్నున్నా, ప్రతిభకు దాంతోనే కొలబద్ధ వేస్తామనే గుంపున్నా వీటన్నింటినీ పట్టించుకోనట్టు ఆ వేదికను కోట్లాది మంది వీక్షకులకు పర్యావరణ పరిరక్షణ సందేశాన్నిచ్చేందుకే వాడుకున్నాడు. డికాప్రియోలోని ఈ రెండో మనిషి అడుగడుగునా కనిపిస్తూనే వస్తున్నాడు. "రెవెనంట్ (సినిమా) ప్రకృతితో మనిషి బంధం గురించి. ఈ సినిమా నిర్మాణం కోసం మేం దక్షిణ కొసకు చేరుకున్నాం.. మంచు జాడను అక్కడే కనుగొనగలిగాం. వాతావరణ మార్పు వాస్తవం. ఇది ఇప్పుడు జరుగుతోంది. ఓ పెద్ద ఉపద్రవాన్ని భూమి మీదున్న ప్రాణులన్నీ ఎదుర్కొంటున్నాయి. మనం సపోర్ట్ చేయాల్సింది భారీ కార్పొరేషన్ల కోసం, పెద్ద కాలుష్యకారకుల పక్షాన మాట్లాడే నేతల్ని కాదు. ఎవరైతే మొత్తం మానవజాతి కోసం.. మూలవాసుల కోసం... ప్రభావితులౌతున్న కోట్లాది మంది బడుగు ప్రజల కోసం నినదిస్తారో ఆ నేతల్ని బలపర్చాలి. మన బిడ్డల బిడ్డల భవిత కోసం... లోభ రాజకీయాలు నొక్కి పెడుతున్న మరెన్నో గొంతుకలకు బలాన్నివ్వాలి. ఈ భూగ్రహాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. ఈ రాత్రిని నేను తేలిగ్గా తీసుకోను." ఇదీ లియోనార్డో డికాప్రియో 88వ అకాడెమీ అవార్డు కార్యక్రమంలో ఆస్కార్ తీసుకుంటూ ఇచ్చిన ప్రసంగంలో కొన్ని మాటలు.

వాట్స్ ఈటింగ్ గిల్బర్ట్ గ్రేప్

నటుడిగా...

'టైటానిక్' సినిమా హీరోగా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది హృదయాల్ని కొల్లగొట్టిన లియోనార్డో 22 ఏళ్ల ప్రాయంలోనే 'వాట్స్ ఈటింగ్ గిల్బర్ట్ గ్రేప్' (1993) చిత్రంలోని ఆర్నీ పాత్రకు బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా ఆస్కార్‌కు నామినేట్ అయ్యాడు. ఆ తర్వాత ఉత్తమ నటుడిగా 'ది ఏవియేటర్' (2005), 'బ్లడ్ డైమండ్' (2007), 'ది వోల్ఫ్ ఆఫ్ వాల్ స్ట్రీట్' (2014) (ఇదే చిత్రానికి ఉత్తమ నిర్మాతగా కూడా) ఆస్కార్‌కు నామినేట్ అయినా 'రెవెనంట్' (2016)లోని హ్యూగ్ గ్లాస్ పాత్రతోనే స్టాట్యూను అందుకోగలిగాడు. క్యాచ్ మీ ఇఫ్ యూ కెన్, గ్యాంగ్స్ ఆఫ్ న్యూయార్క్, టైటానిక్, డిపార్టెడ్, షట్టర్ ఐల్యాండ్, రెవల్యూషనరీ రోడ్, జె ఎడ్గార్, జ్యాంగో అన్‌చైన్డ్, ఇన్సెప్షన్, ది గ్రేట్ గ్యాట్సీ వంటి చిత్రాల్లో ఐకానిక్ పాత్రలెన్నింటికో ప్రాణం పోశాడు.

బ్లడ్ డైమండ్

ప్రకృతి హితుడిగా...

1998లో తన పేరిట ఓ పర్యావరణ మిషన్ ప్రారంభించి కోట్లాది రూపాయల్ని ఆదివాసులు, పర్యావరణ సంక్షేమం కోసం ఖర్చుచేస్తున్నాడు. వాటర్ ప్లానెట్, గ్లోబల్ వార్మింగ్ వంటి వెబ్ ఫిల్మ్స్ ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నాలు చేశాడు. ఆయన రచయితగా, దర్శకుడిగా, వ్యాఖ్యాతగా వచ్చిన 'ది ఎలెవెన్త్ అవర్'' డాక్యుమెంటరీ సంచలనం సృష్టించింది. 2007లో వచ్చిన ఈ డాక్యుమెంటరీ కోసం ఆయన నాలుగేళ్ల పాటు శ్రమించారు. అంతేకాదు అమెరికా అధ్యక్ష ఎన్నికల్ని ఉద్దేశించి... ఎవరైతే పర్యావరణ పరిరక్షణకు ధైర్యంగా పోరాడి, సాహసోపేతంగా పనిచేస్తారో వారినే ఎన్నుకోండని పిలుపునిచ్చాడు కూడా.



రెవెనంట్



ది ఏవియేటర్

ENTERED KSR02 13 111

ఆడపిల్ల పుడితే చాలు. [illegible] మాడిపోతుంటాయి. ఎక్కడలేని చికాకులు వచ్చేస్తాయి. సూటిపోటి మాటలకు బిడ్డ తల్లిలోని సంతోషం కాస్తా ఆవిరైపోతుంది. ఇక ఆస్పత్రి ఫీజు కట్టాల్సి వచ్చేసరికి పేచీలు పెట్టేస్తారు. ఇవన్నీ చూసిన ఓ డాక్టరుగారికి 'ఆడపిల్ల పుట్టినప్పుడు ఆస్పత్రి ఫీజు లేకుండా చేస్తే...' అన్న ఆలోచన వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటికి 436 మంది ఆడపిల్లలకు పురుడు పోసినా పైసా ఫీజు తీసుకోకపోగా ... ఆ శుభసందర్భాన్ని తల్లితో కేకు కోయించి మరీ సెలబ్రేట్ చేయసాగారు.

అమ్మాయి పుడితే ఫీజసలు లేదు!

'ఇంత మంచి మనసున్న డాక్టరుగారు ఎక్కడ వున్నారబ్బా...?' అని ఆశ్చర్యపోవడంలో వింతేమీ లేదు. ఇప్పటి వరకు మనం చెప్పుకున్నదంతా పూనేకి చెందిన డాక్టర్ గణేష్ రఖ్ గురించే. 2007వ సంవత్సరంలో ప్రారంభించారు 'మెడికేర్ ఆస్పత్రి'ని. ఇన్నేళ్లలో ఎన్ని అనుభవాలో.. మరెన్ని పాఠాలో! సాధారణంగా కాన్పు కోసం వచ్చిన వారంతా తమ కోడలికో, కూతురుకో మగపిల్లాడు పుట్టాలనే కోరుకుంటారు. డెలివరీ గది బయట కూర్చుని దేవుణ్ణి మొక్కుకుంటూ వుంటారు. డాక్టరుగారికి కూడా అదే చెప్తారు. తమకు మగపిల్లాడే పుట్టేలా చూడమని. దానికాయన నవ్వుతూ 'అది నా చేతుల్లో వుండదు. ఎవరు పుట్టినా ఆనందంగా స్వీకరించాలి. అది అమ్మాయైతే మరీ సంతోషించాలి' అని. వాళ్ల కోరుకున్నట్టుగా మగపిల్లాడు పుడితే సరి. అంతా సంతోషమే. ఆఖరికి అన్ని నొప్పులు పడ్డ తల్లి కూడా. తేలికపడ్డ మనసుతో హాయిగా నవ్వుతుంటుంది. అదే అమ్మాయి పుట్టిందో... నొప్పులు ఎక్కువైపోతాయామెకు. ఇక ఆమె బంధువుల సంగతి సరేసరి. ఆస్పత్రి ఫీజు కట్టాల్సిన సమయం వచ్చినా నువ్వంటే నువ్వన్నట్టు ఎవరికీ పట్టనట్టు చూస్తుంటారు. చదువుకోని వారు అలా ఆలోచించడాన్ని అర్థం చేసుకోవచ్చు. అజ్ఞానం వల్ల అని సరిపుచ్చుకోవచ్చు. బాగా చదువుకున్నవారు సైతం అబ్బాయే కావాలని కోరుకోవడం, మొండిగా వ్యవహరించడమే ఆయన్ను బాధిస్తుంది. అలాంటి వాతావరణాన్ని మార్చేందుకే... డా॥ గణేష్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు ఆస్పత్రిలో. తమ ఆస్పత్రిలో ఎవరికైనా సరే ఆడపిల్ల పుడితే ఫీజు కట్టాల్సిన పనిలేదు. పైగా రోగులందరికీ స్వీట్లు పంచుతారు.

బిడ్డ తల్లితో కేకు కోయిస్తారు. పూల బొకే అందిస్తారు. చిన్నారికి ఏవైనా ఆరోగ్య సమస్యలున్నా... వాటిని సైతం ఉచితంగానే చికిత్స చేస్తారు. మొత్తంమీద సంతోషంగా సాగనంపుతారా తల్లీబిడ్డల్ని. అలా ఇప్పటికి 436 మంది ఆడపిల్లలు పుట్టారా ఆస్పత్రిలో. 'ఆడపిల్లను కాపాడుకుందాం' అన్న నినాదం ప్రభుత్వ ఆస్పత్రుల్లో వినిపిస్తున్నా...ప్రయివేటు ఆస్పత్రుల్లో ఆ మాట కూడా జొరబడలేనంత జటిలంగా వుంటుంది వాతావరణం. 'ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేది 5 శాతం కేసులే. ప్రయివేటు ఆస్పత్రులకు 95 శాతం కేసులు వెళ్తుంటాయి. అక్కడి వైద్యుల్లో...విధానంలో కూడా మార్పులు రావాలి' అంటారు డాక్టర్ గణేష్. వాళ్ల కూడా తనలా ఆడపిల్ల పుట్టినప్పుడు ఫీజు తీసుకోకపోతే చాలా వరకు మార్పు వస్తుందంటారు. అయితే మొత్తం కాకపోయినా కనీసం నెలకొక కేసైనా అలా చేస్తే కొంతలో కొంత నయమంటారు. 6 వేల మంది వైద్యులు అలా మాట కూడా ఇచ్చారట. అయితే ఎవరు ఎంతమేర మాట మీద నిలబడుతున్నారనేది మాత్రం తెలీదు.

డా॥ గణేష్ క్లినిక్‌లో సాధారణ కాన్పుకు 10 వేల రూపాయలు, సిజేరియన్ కేసుకు పాతిక వేల రూపాయల ఫీజు వసూలు చేస్తారు. ఆడపిల్ల పుడితే ఈ ఫీజును తీసుకోకపోవడమే కాక ... తల్లితో కోయించే కేకు, ఇచ్చే పూల బొకే, రోగులకు పంచే స్వీట్లకు 2 వేల వరకు ఖర్చవుతుంది. మొత్తం 50 పడకల ఆస్పత్రి అది. డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బందితో కలిపి మొత్తం 35 మంది పనిచేస్తారు. ఇక గణేష్ అయితే గత ఆరు మాసాలుగా పగలు డ్యూటీ కాక రాత్రుళ్లు కూడా చేస్తున్నారు. మొత్తం మీద రోజుకి 17 గంటలు పనిచేస్తున్నారు. అందువల్ల మరో డాక్టర్‌కి జీతం ఇచ్చే ఖర్చు తగ్గుతుందంటారు. ఒక్కోసారి రోజుకి ఐదుగురు ఆడపిల్లలు పుట్టిన సందర్భాలు కూడా వుంటాయి. కవల పిల్లలు పుట్టిన సందర్భాలూ వున్నాయి. ఒక్కోసారి ఇద్దరూ ఆడపిల్లలైతే పైసా కట్టనక్కర్లేదు. అదే ఆడమగా పుడితే మాత్రం పదివేల రూపాయలు కట్టించుకుంటుంటారు. ఇంత చేసేదీ ఆడపిల్లను కాపాడుకుందామన్న ఒకే ఒక్క ఆశయం కోసమే.

జీదింటి బిడ్డడే...

ఒక లక్ష్యం కోసం నిస్వార్థంగా సేవ చేస్తున్న డా॥ గణేష్ నేపథ్యం కళ్లు చెమర్చుతుంది. తండ్రి రోజు కూలీ, తల్లి ఇళ్లల్లో పాచిపని చేసేది. మూడు పూటలా తిండి గడవడమే కష్టంగా వుండేది. అలాంటి వాతావరణంలో చిన్నారి గణేష్ కుస్తీ వీరుడు కావాలని కలలు కనేవాడు. అది వాళ్ల అమ్మకు అంతగా నచ్చేది కాదు. 'నువ్వు కుస్తీ నేర్చుకునే పనైతే ఇంట్లో వున్నదంతా ఒక్కడివే తినేస్తావు. మిగతావాళ్లు పస్తులుండాల్సిందే. అందుకే బాగా చదువుకుని ఏదైనా ఉద్యోగం చెయ్యి...' అనేదట. అలా మల్ల యోధుడు కావాలన్న కలను పక్కన పెట్టేసి... డాక్టరై తల్లి స్వప్నం సాకారం చేశాడు. అయితే అందుకోసం చాలానే కష్టపడ్డాడు. వైద్య విద్యనభ్యసించేటప్పుడే రాత్రిళ్లు కాలేజీలో పనిచేసేవాడు. ఆ తర్వాత సైతం ఉదయం తెలిసిన వాళ్ల ఇళ్లకెళ్లి వైద్యం చేస్తూ... రాత్రుళ్లు ఆస్పత్రిలో డ్యూటీ చేసేవాడు. చివరికి సొంతగా క్లినిక్ ప్రారంభించాక కూడా రెండు డ్యూటీలు చేస్తూ ఆడపిల్లను కాపాడాలన్న తన లక్ష్య సాధనకు శాయశక్తులా కృషి చేస్తున్నాడు. వారాంతాల్లో సైతం విశ్రాంతి తీసుకోడు. తన ఏడేళ్ల కూతురితో ఆడుకుంటూ ఒత్తిడి నుంచి బైటపడుతుంటాడట. గొప్ప డాక్టరే కాదు. నాన్న కూడా.

స్టార్.................. 3
పర్‌ఫెక్ట్ 'క్వీన్'
విశేషం.................. 4
హాయ్ గూగుల్
కాఫీ ఉందా..!
కార్టూన్ పంచ్......... 5
వినూత్నం.............. 10
అద్దాలతో నిరసన
తెలుసా...............11
అహోయ్..
హల్లో..హుల్లో...

ఇండెక్స్

అయ్యారే..
అసామాన్యులు..

అట్టమీది కథ.........6

స్ఫూర్తి....12
'మితీ' సహనం
నా కళ్ళతో..............14
ఆరు ఖండాల సైకిల్ సవారీ
వింతలోకం.............16
బ్యాంకర్లు నిషిద్ధం
కథ........................18
గీతను మార్చిన రాత
రుచి.........................21
మామిడితో నాన్-వెజ్ మజా
బాల నేస్తాలు............22
పిల్లల పెద్ద పాదాలు
పదవికాసం..............24

ఆకట్టుకున్న వెనిస్

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం 'స్నేహ'లో సరికొత్త అంశాలు ఇస్తున్నారు. బావుంటున్నాయి. తేలియాడే వెనిస్ నగరం విశేషాలు ఆకట్టుకున్నాయి.

ఎల్. ప్రఫుల్ల చంద్ర, ధర్మవరం, అనంతపురం

'డి' ఫర్ దోశ

ఇంద్రజాలం మెస్మరైజ్ చేసింది. మహమ్మద్ ఛేల్ సైకియాట్రిక్ హిప్న టైజు ట్రిక్కులు, సుహానీ చిరు విన్యాసాలు అబ్బురపరిచాయి. ప్రమాదకర స్థితిలో చిక్కుకున్న పర్యాటకుల పాలిట ప్రాణదాతలు చాచా చాచీ వృద్ధ దంపతులు. ప్రముఖుల సమాధులను దర్శించడం కోసం 65 వేల డాలర్లు ఖర్చు చేయడం వింతగా ఉంది. వెనిస్ అందాలు చూడ ముచ్చటగా ఉన్నాయి, ప్రేమ్‌గణపతి సాధించిన విజయం అమోఘం.

టి. సత్యనారాయణ మూర్తి, వైజాగ్

గొప్ప మనసులు

శాస్త్ర సాంకేతిక విజ్ఞానంలోని గుట్టును పట్టేసి కనికట్టు చేసి అందరిని ఆకట్టుకునే గొప్ప కళ ఇంద్రజాలం అని చాలా చక్కగా వివరించారు. అదే విధంగా ఛేల్ ప్రజల వద్దకు వెళ్ళి వారిని మంత్ర ముగ్ధులను చేయడం నిజంగా అభినందించదగ్గ విషయం. ప్రముఖుల సమాధులను దర్శించడమే హాబీగా పెట్టుకోవడం నిజంగా వింతగా ఉంది. రోడ్డు ప్రమాదాలప్పుడు బాధితుల్ని కాపాడుకునే స్థితిలో ఉన్నప్పటికి వారిని కాపాడలేకపోతున్నాం. అలాంటిది హిమాలయాల్లోని లోయ ప్రాంతంలో తప్పిపోతున్న వారిని కాపాడుతున్న చాచా చాచీవి చాలా గొప్ప మనసులు.

హేమ, విజయవాడ

ఆనందాల వెనిస్

వెనిస్ నగరం నాడు, నేడు ఆహ్లాదకరమైన పర్యాటక ప్రాంతం. వెనిస్ నగరం మునిగిపోతుందా అని తలుచుకుంటేనే మనసు కల్లోలమవుతుంది. ప్రతి సంవత్సరం ఎంతో ఉత్సాహంగా జరుపుకునే కార్నీవాల్ పండుగ ప్రపంచ దేశాల పర్యాటక ప్రియుల మనుసును కొల్లగొడుతుందని చెప్పడంలో ఆశ్చర్యం లేదు. తారలు సమాజసేవ కోసం వారి సమయం కేటాయించడం బాగుంది. లావెండర్ లవ్ పూల తోటలు చాలా బాగున్నాయి. గోడలపై ముగ్గులు వేస్తున్న నెస్సూన్ కుడ్య చిత్రాలు చూడ ముచ్చటగా ఉన్నాయి. చేతిలో చిల్లి గవ్వ లేకుండా ముంబైకి వచ్చిన ఓ 17 ఏళ్ళ కుర్రాడు తన ఆలోచనలతో, స్వయం కృషితో ... దోసెల వ్యాపారం ద్వారా ... దాదాపు నగర వాసులకు సుపరిచితుడైన వ్యక్తిగా మిగిలిపోవడం నిజంగా ఆదర్శ ప్రాయం. తన జీవిత పాఠాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

చెన్నారెడ్డి, రాజోలు, కడప

సేవా తత్పరత

వైద్యాన్ని గొప్ప సంపాదన మార్గంగా భావించే ఈ రోజుల్లో డా॥ రవీంద్ర కోయలే నమ్మశక్యంగాని విధంగా రెండు రూపాయలకే వైద్యం చేయడం... అదీ నిరుపేదలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవలు చేయడం ముదావహం. సెలబ్రిటీలు కేవలం అవార్డు ఫంక్షన్లకే పరిమితం కాకుండా సామాజిక అంశాలపై స్పందిస్తూ పలు సేవా సంస్థలకు రాయబారులుగా వ్యవహరించడం బాగుంది. వారి అభిమానులు కూడా సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది.

రాము, కడప

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

కంగనా రనౌత్‌ను బాలీవుడ్ కింగ్ షారుక్‌లా క్వీన్ అని పిలవాలో...మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ అమీర్‌లా మిస్ పర్‌ఫెక్షనిస్ట్ అనాలో... తెలీక కంగనానే అని పిలుస్తున్నారు. ఆ రెండు ప్రత్యేకతలు కలగలపి ... హిందీ సినిమాల్లో తనకంటూ ఓ బ్రాండ్ వేసేసింది. ఆ బ్రాండ్ తలకట్టులోను కనిపిస్తుంది. వస్త్రధారణలోను తెలుస్తుంది. పాత్రల ఎంపిక లోను స్పష్టమవుతుంది. హర్యానా మాండలికంలో రఫ్‌గా మాట్లాడేసే కంగనా ఓ ఫ్యాషన్ ఐకాన్ కూడా.

పర్‌ఫెక్ట్ క్వీన్

- కంగనా థియేటర్‌లో సినిమా చూసింది ఎప్పుడో తెలుసా ఆమెకు 14 ఏళ్లున్నప్పుడు. ఆమె పుట్టి పెరిగింది హిమాచల్ ప్రదేశ్‌లోని లోయ ప్రాంతమైన మండీలో. అక్కడ థియేటర్ లేదు. చదువు కోసం చండీగఢ్ వచ్చాకే ఆ ముచ్చట తీరింది. కానీ, 27 చిత్రాల్లో నటించిన కంగనా మేటి హీరోయిన్ అయినా ఇప్పటికీ తీరిగ్గా చూసింది కేవలం 10 చిత్రాలే.
- కంగనా తల్లి సంస్కృతం అధ్యాపకురాలు, తండ్రి వ్యాపారి. తల్లి దగ్గర గారాల కన్నా స్ట్రిక్ట్‌నెస్ గురుతులే ఎక్కువ. చదువు కన్నా శిల్పకళ అంటే ఇష్టమని దాన్ని ఎంచుకున్నానంటే తండ్రి తొలిసారి చెంప దెబ్బ కొట్టాడట. ఇక పుస్తకాలు తప్ప మరో లోకం లేకుండా పెరిగింది.
- డాక్టర్ కావాలనుకున్న కంగనా ధ్యాసంతా కూడా చదువులపైనే ఉండేది. ఎప్పుడూ ఎన్ని ఎక్కువ మార్కులు తెచ్చుకుందామా అనే ఆలోచించేదే కానీ అబ్బాయిల ఊసెత్తేదే కాదట. స్నేహితులంతా క్యాంటీన్‌లో కబుర్లు చెప్పుకుంటుంటే తానేమో లైబ్రరీలో పుస్తకాల్లో తలపెట్టి కూర్చునేది.
- ఎప్పుడైతే సినిమాలపై ధ్యాస మళ్లిందో కాలేజీ చదువు ఆపేసి ఢిల్లీలోని ఎలైట్ మోడలింగ్ స్కూల్‌లో చేరింది. అప్పుడామె వయసు 16.
- ఆమె సినిమాల్లో పనిచేయడం తండ్రికి అస్సలు ఇష్టం లేదు. ఇంటి నుంచి వెళ్లిపోమంటే రూపాయి చేతిలో లేకుండా బయటకు వచ్చేసింది. తన కన్నా పదేళ్లు పెద్దదైన జస్‌ప్రీత్ అనే తెలిసిన అమ్మాయితో కొన్నాళ్లు కలిసి ఉంది. ఒంటరిగా ఏ కష్టాలు పడుతుందోనని తండ్రి మనసు మార్చుకుని ఆమెకు 50 వేలు ఇచ్చివెళ్లేందుకు కంగనాను కలిస్తే ఆ డబ్బు తీసుకోలేదు. అది వారి బంధాన్ని మరింత డ్యామేజీ చేసిందని ఆమె పలు సందర్భాల్లో బాధపడింది. సినిమా కష్టాలు ఎంత తీవ్రంగా ఉండేవంటే గూడు లేక రోడ్డు పక్కన బెంచీలపై నిద్రపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి.
- ఢిల్లీకి చెందిన అస్మితా థియేటర్ గ్రూప్‌లో తొలుత నాటక రంగం కళాకారిణిగా కెరీర్ ప్రారంభించింది. అరవింద్ గౌర్ వర్క్‌షాప్‌లో పలు నాటకాల్లో నటించింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా రాని అవకాశం ఓ కాఫీ షాప్‌లో అనుకోకుండా తట్టింది. దర్శకుడు అనురాగ్ బసు ఆమెను కాఫీ షాప్‌లో చూసి ఏకంగా లీడ్ రోల్ ఆఫర్ ఇచ్చేశాడు.
- కంగనా తొలి చిత్రం 'గ్యాంగ్‌స్టర్' (2006). తొలి షాట్ సందర్భంలోనే దర్శకుడు అనురాగ్ బసుతో చీవాట్లు తిని కన్నీళ్లు పెట్టుకుంది. ఓ వైడ్ షాట్ తీస్తుండగా కంగనా ఓ ఎండ్ నుంచి మరో ఎండ్‌కు నడిచి వెళ్లాలి. అదో ఓపెన్ ఏరియాలో చిత్రీకరిస్తుండటంతో ఎవరైనా చెప్పేంత వరకు నడుస్తూనే ఉండాలేమోననుకుని ఫ్రేమ్‌ను దాటేసి వెళ్లిపోయింది. అలా గుంపులో మిస్సయిపోయింది. ఏమైపోయిందో తెలీక క్రూ అంతా ఆమెను వెదకాల్సి వచ్చింది.
- కంగనాకు టీవీ చూడటమంటే చిరాకు. తీరిక దొరికితే పుస్తకాలు చదవడమో, మ్యూజిక్ వింటూ గడిపేయడమో చేస్తుంది.
- కంగనా చెల్లెలు రంగోలి యాసిడ్ దాడి బాధితురాలు. 2005లో ఆమెపై దాడి జరిగింది. ప్రేమ పేరుతో వేధిస్తున్న కుర్రాడు మనీయార్డర్ డెలివరీ చేస్తున్నట్టు నటించి ఆమె తలుపు తీయగానే యాసిడ్ పోశాడు. ఆ తర్వాత విక్రమ్ అనే అబ్బాయిని ఆమెను వివాహమాడాడు.
- 'ఫ్యాషన్, లైఫ్ ఇన్ ఎ మెట్రో, షూటౌట్ అట్ వాడాలా, వో లమ్హే, రజ్జో, వన్స్ అపాన్ ఎ టైమ్ ఇన్ ముంబై, రివాల్వర్ రాణి, కట్టి బట్టి...' చిత్రాల్లో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది.
- 'తను వెడ్స్ మను' సీక్వెల్స్ కూడా హిట్ అవడానికి ఆమె నటనే కారణం. 'క్వీన్' చిత్రంతో ప్రపంచవ్యాప్త గుర్తింపు రావడమే కాక అంతర్జాతీయ విమర్శకుల నుంచి కూడా ప్రశంసల్ని పొందిన అరుదైన బాలీవుడ్ నటి.
- కేవలం నటిగా స్థిరపడాలనే ఉద్దేశమే లేదు కంగనాకు. ఆమెకు అనేక అంశాల్లో ప్రావీణ్యం వుంది. న్యూయార్క్ ఫిల్మ్ స్కూల్‌లో స్క్రిప్ట్ రైటింగ్ కోర్సులో చేరింది. ఓ పీరియాడికల్‌ను రాసింది కూడా. 9 నిమిషాల నిడివితో ఓ షార్ట్ ఫిల్మ్ తీసింది. దర్శకురాలిగా మారాలనుకుంటోందని చెప్పకనే చెబుతోంది.

బెంగళూరు దగ్గర్లో ఉండే ఈ గ్రామం ఓ ప్రత్యేక సంచార జాతికి చెందినది. వారిని 'హక్కీ పిక్కీ తెగ' అంటారు. ఒకప్పుడు వన ఉత్పత్తులపై ఆధారపడిన ఈ జాతి ఆ తర్వాత వేటతో మనుగడ సాగించేది. కానీ అటవీ చట్టాలు కఠినతరం కావడంతో తొలుత భిక్షాటనకు మారారు. ఆ తర్వాత రోడ్ల పక్కన ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకుంటూ ఒక్కో ఊరు గుంపులుగా తిరిగేవారు. ఇలా అనేక ప్రభావాలతో వారి పేర్లను విచిత్రంగా పెట్టుకోవడం మొదలు పెట్టారు. తల్లి గర్భవతిగా ఉన్నపుడు ఏదన్నా ఊర్లో తొలిసారి మైసూర్ పాక్ రుచి చూసిందనుకోండి. ఆమెకు అది నచ్చేస్తే అప్పుడే కడుపులో ఉన్న బిడ్డకు పేరు ఆ స్వీట్‌తో ఫిక్స్ అయిపోతుంది. మరో దంపతులకు పండంటి బిడ్డ ఏ కలకత్తాలోనో, ఢిల్లీలోనో కలిగితే ఆ ఊరి పేరే పెట్టేస్తారు. లేదా వారి వ్యాపారం ఏ హైకోర్ట్ దగ్గరో, సినిమా థియేటర్ దగ్గరో, పార్క్ దగ్గరో బాగా నడిస్తే వాటి పేర్లతో పిల్లల్ని పిలుచుకోవడం వాళ్లకు మామూలు విషయం. ఇలా చెప్పుకుంటూ పోతే రాజ్ కపూర్, శశి కపూర్, మంత్రి, ట్రైన్, గ్లూకోజ్, బ్రిటిష్, బస్, హోటెల్, మిలిటరీ, డాలర్, జైలర్... ఇలా వారి ఇష్టం. వారి ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు ఇతర గుర్తింపు కార్డుల్లో అవే పేర్లు నమోదు చేసి ఉంటాయి. స్థానికంగా పనిచేసే అంగన్‌వాడీలకు ఈ పేర్లతో పెద్ద తలనొప్పే. సంబరాలు, మేళాలు, ఉత్సవాలు ఎక్కడ జరిగితే అక్కడకు అలంకరణ వస్తువులు అమ్మడానికి వెళ్లిపోతూ సంచార జీవనం సాగిస్తారు హక్కీపిక్కీలు. దేశంలోని ప్రతి కార్నర్‌ను టచ్ చేస్తూ సాగిపోయే ఈ సంచారులు ఆయా భాషల్లోని పదాల్ని ఎప్పటికప్పుడు తమ భాషలోకి లాగేసుకుంటారు. అందుకే వారి మాటల్లో ఇంగ్లీష్, హిందీ, కన్నడ, తెలుగు, తమిళ్, పంజాబీ, అస్సామీ ఇలా ప్రతి భాష ఛాయలు కనిపిస్తాయి. అన్ని భాషల్ని కిచిడీ కిచిడీ చేసి చప్పరించేస్తుంటారు. ఎస్టీల కిందకు వచ్చే వీళ్లు 14 భాషల్ని కలగలపి మాట్లాడతారు. వీళ్లలో కొంత మంది వ్యాపారంపై విదేశాలకు వెళ్లొచ్చారు. ఇంకేముంది వారి పేర్లు జపాన్, చైనా, పాకిస్తాన్ అయిపోయాయి. ఇప్పుడిప్పుడే వీళ్లు స్థిరపడుతున్నారు. కొందరు వ్యవసాయం చేస్తున్నారు కూడా. గ్రామంలో స్థిరపడిన వారు పిల్లల్ని బడికి పంపుతున్నారు. అయితే వీరి భాషతో మాస్టార్లకు పెద్ద చిక్కే వచ్చి పడింది. దీంతో ఒక్కో పాఠాన్ని పదిసార్లు చెప్పాల్సి వస్తోంది. అది రెండు మూడు భాషల్ని మిక్స్ చేస్తూ పిల్లల పేర్లను చూసి నవ్వుకుంటున్న విషయం అర్థమై పేర్లను మారుస్తున్నారు. వీళ్ల సంచార జీవన శైలి కూడా ఓ పంథాన ఉండదు. రైల్లో తప్ప మిగతా మార్గాల్లో ప్రయాణాలు చేయరు. ఒక ట్రైన్‌లో నుంచి టికెట్ లేదని దింపేస్తే వెంటనే

హాయ్ 'గూగుల్'.. 'కాఫీ' వుందా!

ఆ ఊర్లో మైసూర్ పాక్, కాఫీ కలిసి షికారు వెళతాయి. గూగుల్ మామూలు మారం చేయదు. ఇంగ్లీష్ ఐడి ఎగ్గొట్టేసి గోలీలాడుకుంటాడు. నమ్మరా! అయితే మీరే వెళ్లి కర్నాటకలోని భద్రపుర గ్రామంలో తిరిగిరండి. అప్పుడు మీరే చెబుతారు హైకోర్ట్‌ను చంకనెక్కించుకుని ముద్దాడారని, కాంగ్రెస్‌తో కలిసి షికారుకెళ్లారని. ఇవన్నీ ఆ గ్రామ ప్రజల పేర్లు. నవ్వు తెప్పించే పేర్లకు కారణం వారి సంచార జీవనశైలే.

పక్కనే ఉన్న మరో ట్రైన్‌లో ఎక్కేస్తారు. అది ఎక్కడికి తీసుకెళితే అక్కడకు వెళ్లి వ్యాపారం సాగిస్తారు.

నవ్వు రాదు

వీరి పేర్ల తీరే కాదు ఆచారాలు, వ్యవహారాలన్ని మిగతా వారికి చాలా భిన్నంగా ఉంటాయి. హక్కీపిక్కీల పెళ్ళిళ్లు, విడాకులు, ఆరాధన అంతా విభిన్నంగా ఉంటాయి. కన్యాశుల్కం నడుస్తోంది. పెళ్లిళ్లన్నీ రాత్రుళ్లే జరుగుతాయి. తాళి సరిగ్గా అర్ధరాత్రిన కడతారు. కట్నకానుకల కింద డబ్బుతో పాటు కోళ్లను, మద్యాన్ని, బియ్యాన్ని, ఫలాల్ని చదివిస్తారు. విడాకులకు అంత కష్టపడరు. విడిపోయేపుడు కన్యాశుల్కంగా వచ్చిన డబ్బులో సగం తిరిగిచ్చేయాలి. వేరేవాళ్లను పెళ్లి చేసుకోడానికి ఏ అభ్యంతరాలుండవు. పిల్లలు మాత్రం తల్లితోనే ఉండాలి. విడిపోయిన తర్వాత కూడా పిల్లల పెళ్ళిళ్ల భారాన్ని తండ్రే చూసుకోవాలి. వీరి పద్ధతుల్లో కొన్ని కఠినమైన నిబంధనలున్నాయి. పక్క ఊరి అబ్బాయిని ప్రేమిస్తోందని సర్పంచ్ కూతురినే గ్రామం నుంచి వెలేశారు. గ్రామ దేవతల్ని పూజిస్తారు. వీరి పేర్లు నవ్వుగొలిపేలా ఉన్నా పట్టణీకరణ, వీరిని నిర్లక్ష్యం చేస్తోన్న అటవీ చట్టాలు వీరి జీవితాలపై ఎంత తీవ్ర ప్రభావం చూపుతున్నాయనే దానికి ఉదాహరణ. తమవి కాని భాషలతో, తమది కాని జీవన శైలితో వారి అవస్థలు వర్ణనాతీతం. కొత్త ప్రదేశాలకు వెళ్లాక అక్కడి స్థానికులతో సర్దుబాటు చాలా కష్టమవుతుంది. కొన్ని చోట్ల దాడులు, దోపిడీలు సాధారణమే. విద్యకు చాలా దూరంగా సాగిపోతున్న వీరు అడుగడుగునా మోసాలకు గురౌతుంటారు.

రాజ్‌పుత్ర రాజు రాణా ప్రతాప్ సింగ్‌తో దగ్గరి సంబంధాలు నెరిపిన గొప్ప చరిత్ర వీరి సొంతం. కానీ వీరిలో చాలామందికి ఆ విషయం ఎరుకలో లేదు. వారు ఆరాధించే కొండలు, అటవీ ప్రదేశాల పేర్లతో పిల్లలకు నామకరణం చేయడం వందల ఏళ్ల క్రితం ఆచారంగా ఉండేది. వీరిని బలవంతంగా అడవుల నుంచి బయటకు లాగేసేట్లు ప్రభుత్వ విధానాలు ఉండటంతో బ్రిటీష్ కాలం నుంచే సంచార జాతిగా మారడం మొదలైంది. వారి సొంత భాషలో చాలా పదాలు మాయమైపోయాయి. సంచార జీవనశైలి వల్ల వారి పూర్వాచారాలు, పద్ధతుల్ని పూర్తిగా మరిచిపోయారు. వారి సంస్కృతిని కోల్పోయారు. తమిళనాడుకు చెందిన నరికురవ జాతికి, తెలుగు రాష్ట్రాల్లో కనిపించే దొమ్మరులకు వీరికి పోలికలున్నా మిగతా వారికన్నా పూర్తిగా ధ్వంసమైన జాతి అనొచ్చు. ఇదంతా తెలిశాక 'మైసూర్‌పాక్' పేరని చెబితే నవ్వు రాదు.

కార్టూన్ పంచ్





నవ్వుల్- పువ్వుల్

హీరోల పరీక్ష (సరదాకే..!)

మన హీరోలు పరీక్ష రాయటానికి వచ్చారు.

పరీక్ష మొదలైన పది నిమిషాల తరువాత వచ్చాడు మహేష్ బాబు.

'ఏంటి బాబు లేట్?' అంటే..

మహేష్: ఎప్పుడు వచ్చామా అని కాదు అన్నయ్యా! పరీక్ష రాశామా లేదా..? అనేది ముఖ్యం.(ఇంతలో వెనకున్న చిరంజీవి 'బ్రదర్ ఇది తీసుకో' అని స్లిప్ ఇస్తాడు. మహేష్ థ్యాంక్స్ చెబితే)

చిరంజీవి: థ్యాంక్స్ కాదు బ్రదర్. ఆ స్లిప్‌ను మూడు చేసి ముగ్గురికి ఇవ్వు, ఆ ముగ్గురిని ఇంకో ముగ్గురికి ఇవ్వమని చెప్పు. అలా క్లాసులో మొత్తం చేయండి.

బాలకృష్ణ: (స్లిప్పులు ఎక్కవై కోపం వచ్చి) ఒరేయ్... నేను కాపీ కొట్టడం మొదలు పెడితే..ఏ ప్రశ్నకి ఏ జవాబు రాశానో కనుక్కోవడానికి వారం పట్టుద్ది. మర్యాదగా ఏ ప్రశ్నకి ఏ స్లిప్పో సరిగ్గా చెప్పండి.

(ఈ లోపు ఎగ్జామ్ స్క్వాడ్ వచ్చి పేపర్లు లాక్కుని అందరినీ బయటకు పంపారు. ఇన్ఫర్మేషన్ ఎవరు ఇచ్చారా..అని అందరూ ఆలోచిస్తుంటే అందరికన్నా చివరన వచ్చాడు రవితేజ)

రవితేజ: ఇన్ఫర్మేషన్ ఎవరు ఇచ్చారా అనేగా మీ డౌట్. నేనే ఇచ్చా...ఊరికినే కాపీ కొడితే...కిక్ ఏముంటుంది...?



అట్టమీది కథ

అయ్యారే... అసామాన్యులు..

నిజానికి ప్రతి ఒక్కరూ తమది చిన్ని ప్రపంచం అనుకుంటారు. అయితే ఆ చిన్ని ప్రపంచంలోనే ఎన్నో అసమానతలు, వివక్షలు. అదే మహిళలైతే మరీను. ఆడపిల్లగా నేల మీద పడింది మొదలు నెత్తిమీద అక్షింతలు వేయించుకునే వరకు. కాపురానికి వెళ్లింది మొదలు కాటికి చేరే వరకు. ప్రతి దశలోనూ.. మలుపులోనూ... మనసును మెలిపెట్టే ఘటనలకు లెక్కే లేదు. వాటిలో తరాల తరబడి నీడలా వెన్నాడేవి కొన్నయితే... తరాలు మారినా ... మారని మనసులు తెచ్చే సమస్యలు కొన్ని. వాటిని మెల్లగా దాటుకుంటూ ముందుకు వచ్చే అసమాన్యలు కొందరైతే... గొప్ప వేగంతో తటాల్న మార్పు తెచ్చే ఉరుమిలు మరికొందరు. మంచి మనసుతో తోటివారికి సాయపడే మానవిలు ఇంకొందరైతే... న్యాయంగా తమకు దక్కాల్సిన స్థానం కోసం విరుచుకుపడే శివంగులు మరికొందరు. మార్చి 8 మహిళా దినోత్సవం సందర్భంగా ... అలాంటి కొందరు అసామాన్యల గురించి...

- కె. అంజన



గోడ మీద ఇంటావిడ పేరు

సాధారణంగా ఇంట్లో వాడుకునే వస్తువుల మీద మగవాళ్ల పేర్లే కనిపిస్తుంటాయి. ఇక ఇళ్లకూ వాళ్ల పేర్లే పెడుతుంటారు. ఇంటి గోడ మీద పలానా పెద్దమనిషి ఇల్లని రాసుకుంటుంటారు. ఆ ఇంటికోసం, ఇంట్లో వాళ్ల కోసం నిరంతరం కష్టపడే, కృషి చేసే ఆడవాళ్ల పేరు ఎక్కడా కనిపించదు. ఏం చేస్తాం?! పితృస్వామిక భావజాల ప్రభావం అని సరిపుచ్చుకోవద్దంటున్నారు హర్యానా అమ్మాయిలు. అక్కడ ఆడపిల్లల సంఖ్య ఎంత తక్కువగా వుంటుందో తెలియనిది కాదు. ఆడవాళ్ల మీద నేరాలు సైతం పెద్ద ఎత్తున జరుగుతుంటాయక్కడ. అలాంటి చోట ఇప్పుడు ఓ ఉద్యమమే నడుస్తోంది. సమానత్వం కోసం పోరాటమే చేస్తున్నారు కొంతమంది యువతులు. వాళ్లలో బిఎస్సీ మూడవ సంవత్సరం చదివే సంజన ఒకరు. తమ ఇంటి గోడ మీద నాన్న పేరు పైన అమ్మ పేరు రాసేసింది కూడా. అలా ఆ ఇల్లు నాన్నదే కాదు. అమ్మది కూడా అని చెప్తోంది. తన స్నేహితురాళ్లతో జట్టుగా తయారై... గ్రామంలో ఏ ఒక్క ఇంటిని కూడా విడిచిపెట్టకుండా కలిసి స్త్రీపురుష సమానత్వం గురించి అర్థమయ్యేలా చెప్తున్నా... అన్నిచోట్లా సానుకూల స్పందన రావడంలేదు. భార్యలుగా, తల్లులుగా, అక్కచెల్లెళ్లుగానే ఆడవాళ్లకు గుర్తింపు వుంటోంది. కొన్నిసార్లు తమ పేరును కూడా మర్చిపోతున్నారు. సమాజంలో వున్న ఈ ధోరణిని మార్చడానికే మా ఈ ప్రయత్నం' అంటోంది సంజన.

క్యాన్సర్ చిన్నారులకు ఓ తల్లి ఓదార్పు

పగవాడికి కూడా రాకూడదని కోరుకునే జబ్బుల్లో ఒకటి క్యాన్సర్. ఆ మహమ్మారి కారణంగా తన చిన్నారి ఎంతగా బాధపడిందో కేరళకు చెందిన షీబా అమీర్‌కు బాగా తెలుసు. తన కూతురు సూర్యోదయం చూస్తుందో లేదో అన్న బెంగతో రాత్రుళ్లు నిద్ర కూడా పట్టేది కాదు. ఆ బాధంతా బిగబట్టి... పాపకు మంచి వైద్యం ఎక్కడ అందుతుంది? తన చిన్నారి దేవత పడే బాధను సాధ్యమైనంత వరకు ఏ మందులతో తగ్గించవచ్చో తెలుసుకునేది. ఆఖరుకు ముద్దుల కూతుర్ని మాత్రం కాపాడుకోలేపోయింది. 'ఇంత డబ్బు ఖర్చు చేసి, మంచి వైద్యం అందించినా పాపను కాపాడుకోలేకపోయామే...

ఇక పేదల సంగతేంటి?' అన్న ఆలోచన ఆ తల్లిని నిలవనీయలేదు. ఏళ్ల తరబడి ఆస్పత్రుల చుట్టూ తిరగడం వల్ల లభించిన అనుభవజ్ఞానంతో.... వాళ్ల కోసం ఏదో ఒకటి...ఎంతో కొంత చేయాలని తపన పడింది. అయితే ఒక ముస్లిం గృహిణిగా తనకు కొన్ని ఆటంకాలు వున్నా...వాటిని అధిగమించి ప్రారంభించినదే 'సొలేస్'.(ఓదార్పు అని అర్థం) ఆ సంస్థ ద్వారా క్యాన్సర్ సోకిన చిన్నారులకు సాధ్యమైనంత వరకు మంచి వైద్యం ఎక్కడ, చవగ్గా అందుతుందో సమాచారం ఇవ్వడం, వీలైనంత ఆర్థిక సాయం చేయడం, కుటుంబీకులకు కౌన్సిలింగ్ ఇవ్వడం చేస్తోంది. ఆ చిన్నారి రోగుల్లోనే తమ పాపాయిని చూసుకుంటోందా మాతృమూర్తి.

చదువుల తల్లులు

ఉత్తరప్రదేశ్‌లోని సజోయి ఓ చిన్ని గ్రామం. అక్కడ ఆడపిల్లలకు అక్షరం అందని పండే. తమకంటే చిన్నవాళ్ల ఆలనా పాలనా చూసుకోవడానికో... అమ్మకు ఇంటి చాకిరిలో బయటి పనుల్లో సాయం చేయడానికో... బడి ముఖం చూడకుండానే పెళ్లిళ్లు చేసుకుని అత్తారిళ్లకు వెళ్లిపోతుంటారు. అయితే ముగ్గురమ్మాయిలు వారి రాతను మార్చే ప్రయత్నం చేస్తున్నారు. వారే తబుస్సుమ్, తర్రసుమ్, రుబీనా. ఆ ఊళ్లో పాఠశాల విద్య పూర్తి చేసుకున్న ముగ్గురు కూడా వాళ్లే. అయితే చిన్నారుల ఆసక్తితోపాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా వారికి కలిసి వచ్చింది. మిగతా వారలా కాదు. పేదరికం కారణంగా ఏ పూట తిండిని ఆ పూట సంపాదించుకోవడమే కష్టంగా వుంటుంది. ఇంక చదువుసంధ్యల గురించి ఆలోచించేదెక్కడ! అయినా సరే ఊళ్లో మార్పు తేవాలనుకున్నారు. ఆడపిల్లలకు అక్షరం నేర్పాలనుకున్నారు. బడికి పంపమని, రమ్మని ఇంటింటికి వెళ్లి అందర్నీ అడిగారు. మొదట చాలా కష్టమైంది. చదువుతోపాటు... టైలరింగ్ కూడా నేర్పుతామని చెప్పాక...కుట్టు మిషన్లు పెట్టాక... ఆరునెలల తర్వాత మెల్లగా మార్పు మొదలైంది. మిషన్ నేర్చుకున్నాక...అక్షరాలు చెప్పనారంభించారు. అలా చదువు పట్ల ఆసక్తి కలిగి... ప్రస్తుతానికి 170 మందికి పైగా చిన్నారులు వస్తున్నారు పాఠశాలకు.

ఐ.ఎ.ఎస్ కావాలన్నది ఆటోవాలా కల

ఆటో నడిపిన వారెందరో మంచి మంచి ఉద్యోగాలు సంపాదించుకుంటున్న కథనాలు వింటున్నాం. చూస్తున్నాం. ఆ జాబితాలో చేరాలని ఉవ్విళ్లూరుతోంది ఎల్లమ్మ. ఇరవైరెండేళ్లకే బోలెడంత చేదు జీవితం చవిచూసింది. పెళ్లి కావడం, పాప పుట్టడం, భర్త దూరం కావడం... అన్నీ జరిగిపోయాయి కొద్ది రోజుల్లోనే. పాప, తను బతకడానికి పట్టుబట్టి ఆటో నడపడం నేర్చుకుంది. మొదట్లో ఆమెకు ఆటో అద్దెకు ఇవ్వడానికి ముందుకొచ్చేవారు కారు. మహిళ అన్న కారణంగానే. చివరికెలాగో సాధించింది. రోజుకి 750-800 రూపాయల వరకు సంపాదిస్తుంది. అయితే అద్దె, పెట్రోలు ఖర్చు పోగా అందులో మిగిలేది సగమే. ప్రస్తుతానికి పియుసి చదువుతున్నా...ఆమె అంతిమ లక్ష్యం మాత్రం ఐఎఎస్ కొట్టడమే. అందుకే మధ్యలో ఎప్పుడు ఖాళీ దొరికినా ... ఒక్క క్షణం కూడా వృధా పోనీకుండా... దిన వార మాస పత్రికలన్నీ తిరగేస్తుంటుంది. తోటి ఆటోవాలాలు సైతం ఆమె దీనగాథ తెలిసినవారు కనక ... బేరాల విషయంలోనైనా...ఇతర సమస్యలేమైనా తలెత్తినప్పుడైనా సాయం చేస్తుంటారు.

జడ్జయిన టీవాలా కూతురు

ఒక్కోసారి అనిపిస్తుంది. ఇలాంటివి సినిమాల్లోనే సాధ్యమని. కానీ నిజంగానే జరిగింది. పంజాబ్‌కు చెందిన సురీందర్ కుమార్ ఓ టీ కొట్టు నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. అదీ ఒక కోర్టు ఆవరణలో. ఆయన కుమార్తె శృతికి చదువంటే ప్రాణం. అందునా న్యాయశాస్త్రంలో పట్టా పుచ్చుకోవాలనేది ఆమె కల. అందుకు తగ్గట్టుగానే ...గురునానక్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్, పంజాబ్ యూనివర్సిటీలో లా చదివింది. పంజాబ్ సివిల్ సర్వీసెస్ (జుడిషియల్) రాసి ఎస్సీ విభాగంలో నెంబర్ 1గా నిల్చింది. అదీ మొదటి ప్రయత్నంలోనే. ఏడాది పాటు శిక్షణ పూర్తయ్యాక జడ్జిగా నియమితురాలైంది. అదీ ఎక్కడనుకున్నారు! తన తండ్రి ఏ కోర్టు ఆవరణలోనైతే టీ అమ్మాడో...అక్కడే. ఇక ఆ తండ్రి ఆనందానికి అవధులే లేవనుకోండి. ఏ కోర్టులో అయితే టీ గ్లాసులు పట్టుకుని అమ్మాడో అక్కడే తన కూతురు జడ్జిగా రావడానికి మించిన సంతోషం మరేముంటుంది!

'మోడల్' పనిమనిషి

మోడలింగ్ అంటే మాటలు కాదు. దానికోసం ప్రత్యేకమైన శిక్షణ, కఠోర సాధన, కుతికలు కోసుకునే పోటీ వుంటాయి. అలాంటిది పది ఇళ్లల్లో ఎంగిలి గిన్నెలు కడిగే, బట్టలు ఉతికే అమ్మాయి మోడలింగ్ చేస్తుందని ఊహించగలమా! అది కమల జీవితంలో జరిగింది. కమల ఇద్దరు పిల్లల తల్లి. పదిళ్లలో పాచి పని చేసుకుంటుంది. భర్త కూలీనాలీ చేస్తుంటాడు. దేశ రాజధానిలో కుటుంబం గడవాలంటే మాటలా మరి. కమల పనిచేసే ఓ ఇంటి పక్కనే ప్రముఖ మోడల్ డిజైనర్ మన్‌దీప్ నాగి నివాసం. కమలను చూశాక ఆమెకో వినూత్న ఆలోచన వచ్చింది. తను కొత్తగా రూపొందించిన కలెక్షన్‌కు మోడల్స్‌ను కాకుండా కమలతో చేయిస్తే ఎలా వుంటుంది?! అని. కమలకు అదే చెప్పింది. మొదట భయపడి బెదిరిపోయినా... ఒప్పించేసరికి చాలానే ప్రయాస పడాల్సి వచ్చింది. చివరికి కమలతో షూట్ పూర్తయింది విజయవంతంగా. 'ఏమో...ఇది కమల జీవితాన్ని మారుస్తుందేమో' అంటుంది మన్‌దీప్ ఆశావహంగా.

'పెళ్లి చేసుకోను పో...'

పెళ్లి కుదిరాక...నిశ్చయ తాంబూలాలు పుచ్చుకున్నాక... అబ్బాయిని పెళ్లి చేసుకోనని ఓ అమ్మాయి చెప్పాలంటే అందుకు ఎంతో గుండె ధైర్యం కావాలి! తెగువ వుండాలి! ఈ ఘటన కేరళలో జరిగింది. ఆ సాహసే రమ్య. అతగాడు ముందర కట్న కానుకలేమీ అవసరం లేదని, తన జీవితంలోకి ఆమె రావడమే తనకు చాలని కల్లబొల్లి కబుర్లు చెప్పాడు. తీరా తాంబూలాలు పుచ్చుకున్నాక... కట్నం కావాలని షరతులు పెట్టాడు. అయితే రమ్య అతనికి చెప్పుతో కొట్టినట్టు ఫేస్‌బుక్ ద్వారా గట్టి సమాధానమే ఇచ్చింది. 'నేను నా పెళ్లిని రద్దు చేసుకుంటున్నాను. ఎందుకంటే... వరకట్నానికి నేను బద్ధ వ్యతిరేకిని. అతను తాంబూలాలు పుచ్చుకోక మునుపు తన జీవితంలోకి నేను మాత్రమే వస్తే చాలన్నాడు. ఆ తర్వాత 5 లక్షల రూపాయలు కట్నం ఇవ్వాలని, 50 సవర్ల బంగారం పెట్టాలని అన్నాడు.... అది ఏమాత్రం నచ్చని నేను ఆ నిర్ణయం తీసుకున్నాను' అని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది మిత్రబృందానికి. రమ్య నిర్ణయాన్ని మెచ్చుకుంటూ అభినందనలు వెల్లువలా వచ్చిపడ్డాయనుకోండి. ఒకవేళ పరువు కోసం అతను అడిగినవన్నీ ఇచ్చి అతనితో తాళి కట్టించుకున్నా... ముందు ముందు ఇంకెన్ని డిమాండ్లు పెడతాడో ఎవరికి తెలుసు. అందుకే శభాష్ రమ్యా!

బీహార్ నుంచి... రిపోర్టర్ లక్ష్మి...

బీహార్‌లో అత్యంత సమస్యాత్మక బీద జిల్లా శివహర్. కరువు కాటకాలు, వెనకబాటుతనం అక్కడ బాగా ఎక్కువ. అలాంటి జిల్లాలోని ఒకానొక గ్రామం లక్ష్మిది. అందరి అమ్మాయిల్లాగే తనకూ పట్టుమని పధ్నాలుగు సంవత్సరాలు కూడా నిండక మునుపే పెళ్లయిపోయింది. నాలుగేళ్లు తిరిగే సరికే ఇద్దరు బిడ్డల తల్లయింది. ఆనక 'ఖబర్ లహరియా' అనే వార పత్రికలో రిపోర్టర్‌గా చేరింది. తన ఇద్దరు పిల్లలను అమ్మమ్మ దగ్గర విడిచిపెట్టి... వాళ్లకు దూరంగా వుంటూ సీతామరి జిల్లా నుంచే ఉద్యోగం చేసేది. మహిళలపై జరిగే హింస, స్థానిక అంశాలు, మంచినీరు, మురుగునీటి సమస్యలు, ఆరోగ్య సంబంధ విషయాలు, స్థానిక పంచాయతీలు, సభ్యుల పని విధానం, పాఠశాలల పరిస్థితి... వంటి అనేక అంశాలపై పత్రికలో వార్తలు కథనాలు వస్తుంటాయి. కొద్ది సంవత్సరాల పాటు పని చేశాక లక్ష్మికి చదువు ప్రాధాన్యత అర్థమై హిందీలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసింది. వార్తల సేకరణతోపాటు ఫొటోలు, వీడియో తీయడంలోనూ ప్రావీణ్యత సంపాదించింది. నాలుగేళ్ల అనంతరం బ్యూరో చీఫ్‌గా లక్నో చేరింది. ప్రస్తుతానికి పత్రిక వెబ్‌సైట్ కూడా చక్కగా నిర్వహిస్తోంది. తల్లి ఆలనా పాలనలో వున్న చిన్నారు లను తీసుకొచ్చుకోవాలని, వాళ్లను మంచి స్కూళ్లలో చదివించాలని కోరిక.

పోకిరీల పనిబట్టే ఎర్రదండు

ఉత్తరప్రదేశైనా...విజయవాడైనా...ఆడపిల్లలను ఏడిపించే వారికేం కొదవ లేదు. స్కూళ్లకో...కాలేజీలకో...పనుల మీదో వెళ్లేవారి వెనకపడి వెకిలి వేషాలేసే పోకిరీలు ప్రతి ఊళ్లోనూ వుంటారు. వీలు దొరికితే అత్యాచారం చేయాలని చూసే వారూ వుంటారు. అలా ఒకడు తన మీద అఘాయిత్యం చేయబోగా వాడి చేతిలోంచి తెలివిగా బయటపడ్డా... ఆ ఘటన ఆమెలో భయం నింపక పోగా... నిర్భయంగా నిలబడేలా... ఇతరులకు సాయం చేసేలా తయారు చేసింది. ఆమే ఉషా విశ్వకర్మ. ఆమె ప్రారంభించిందే 'రెడ్ బ్రిగేడ్' (ఎర్ర దండు). ప్రారంభంలో దండులో పదిహేను మందే వున్నప్పటికీ ... ఇన్నేళ్లలో 17,000 మందికి కరాటే నేర్పారు. మొదట్లో ఇంటా బయటా ఆమె చేస్తున్న పనికి వ్యతిరేకతే వచ్చింది. వెకిలినవ్వులు, ఎగతాళితో కూడిన మాటలే ఎదుర య్యాయి. వేటినీ లెక్క చేయకుండా తన దండును నడుపడంలోనే ఉష విజయం వుంది. ఎంద రో ఆడపిల్లలకు ఆపదలో వున్నప్పుడు సాయం చేసింది దండు. పోలీస్ కేసు పెట్టడంతో సరిపుచ్చుకోకుండా... పోకిరీలను బయటకు ఈడ్చి దేహశుద్ధి చేసిన ఘటనలు కూడా వున్నాయి. ఎరుపు నలుపు బట్టలు వేసుకున్న ఈ అమ్మాయిల బృందం వీధుల్లో నడుస్తుందంటే ఆకతాయిలు తోక ముడుచుకు పోవాల్సిందే.



ఆడవాళ్లతో ... అగ్నిమాపక దళం

కొన్ని పనుల పేరు చెప్పగానే పురుషులవే అనుకోవడం పరిపాటి. అలాంటి వాటిలో అగ్నిమాపక దళం ఒకటి. ఉవ్వెత్తున ఎగిసిపడే మంటలను, పొగను అదుపు చేయడానికి, ఆస్తి, ప్రాణ రక్షణకు మగవాళ్లైతేనే అదురుబెదురు లేకుండా పనిచేస్తారనుకుంటాం. అయితే రాజస్థాన్ యువతులు అలా మనలో పాతుకుపోయిన పాతచింతకాయ పచ్చడి అభిప్రాయాలను తారుమారు చేసి ... తమ శక్తిసామర్థ్యాలతో అభినందనలు అందుకుంటున్నారు. జైపూర్‌లో వున్న అగ్నిమాపక కేంద్రంలో సునీత, నిర్మా, సీత, నిర్మల, మనోజ్‌తో కూడిన మహిళా దళం పనిచేస్తోంది. పంచపాండవుల్లా ఈ ఐదుగురు మహిళలు కదిలారంటే ఎలాంటి అగ్ని ప్రమాదాన్నైనా అతి తక్కువ నష్టంతో బైటపడేస్తారనే నమ్మకం కలిగిస్తున్నారు. అలాంటి ఒకానొక సందర్భంలో ఓ ఇంట్లో వున్న వస్తువులన్నీ అగ్నికి ఆహుతైపోయాయి. అయితే కుటుంబ సభ్యులను జాగ్రత్తగా కాపాడగలిగారు. ఆడవాళ్లయినప్పటికీ వెనకడుగేయక మంటలు ఆర్పడానికి శివంగుల్లా పనిచేసిన వారిని చూసి ఆ ఇల్లాలు ఆగలేక...వాళ్లను ఆలింగనం చేసుకొని ఆనందభాష్పాలు కురిపించేసింది. వీలున్నంతమేర అమూల్యమైన ప్రాణాలతోపాటు, విలువైన ఆస్తులను కూడా కాపాడ్డానికే ప్రయత్నిస్తారు. 'ఆవురావురుమంటూ ఎగిసిపడే అగ్ని కీలలను అదుపు చేయడానికి శారీరక శక్తిసామర్థ్యాలతోపాటు, బుద్ధి కుశలత కూడా అవసరం. ఈ రెంటికీ తోడు ధైర్యసాహసాలూ గుండెల నిండా వుండాలి' అని అంటారీ బృంద సభ్యులు. అవన్నీ వున్నందునే ఈ ఐదుగురు స్థానికుల మన్ననలు పొందుతున్నారు.

సామాన్యుల్లో సామాన్యులుగా వుంటూనే అసమాన ధైర్య సాహసాలను, మానవత్వాన్ని, ప్రదర్శించే ఇలాంటి వారు వందల్లో ... వేలల్లో ... వుంటారు మన చుట్టూ. అప్పటి వరకు వున్న రొటీన్ వాతావరణం నుంచి బయటపడి ... మార్పు కోసం వాళ్లు వేసిన ... ఆ ఒక్క అడుగు ఎందరికో మార్గదర్శకంగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. మహిళా దినోత్సవం సందర్భంగా వీరందరికీ అభినందనలు అందిద్దాం.

✦





అద్దాలతో నిరసనలు

రాజ్యహింస ప్రజల అసంతృప్తుల్ని, ఆవేదనల్ని అణచివేసేది పోలీస్ చర్య ద్వారానే. ఉద్యమాలు చేసే వాళ్లకు మాబ్ మెంటాల్టీ అంటకట్టి దాడులు సాగించే బలగాల దాష్టీకమూ హిస్టీరియాలానే తోస్తుంది. ఒక్కడినే పదిమంది కలసి దాడి చేసేపుడు వారిలో మనిషిని మర్చిపోతారు. ఆ మనిషినే చూపించే ప్రయత్నం జరుగుతోంది కొన్ని ఉద్యమాల్లో. అక్కసు వెళ్లగక్కేపుడు ఎంత రాక్షసంగా కనిపిస్తారనేది తెలిపేందుకు అద్దాల్ని తెస్తున్నారు కొందరు ఉద్యమకారులు. వాటిలో తమ ప్రతిబింబాల్ని చూసి కొందరిలోనైనా మార్పు సాధ్యమవుతుందనేదే ఈ వినూత్న పోకడ ఉద్దేశం.

1967లో అమెరికా రక్షణ శాఖ కేంద్రం పెంటగాన్ వద్ద వియత్నాంతో యుద్ధానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యమకారుల్ని కట్టడి చేయడానికి వచ్చిన పోలీసులకు ఓ అమ్మాయి గులాబీనిచ్చి శాంతి సందేశాన్ని ప్రకటించింది. 'ఫ్లవర్ పవర్'గా 1960, 70ల్లో ఆ తరహా ఉద్యమ పోకడలు పెరిగాయి. అహింసా మార్గంలో, శాంతియుతంగా ఉద్యమాలు చేస్తున్నా పోలీసు దాడులు తప్పేవి కాదు.





అంతకు ముందు అమెరికా యూనియన్ యుద్ధమపుడు, ఫ్రెంచి విప్లవం సమయంలో, ప్రపంచ యుద్ధ సందర్భాల్లోను.. సైనికులు ఎక్కుపెట్టిన తుపాకీ గొట్టాల్లో గులాబీలను ఉంచి శాంతిని కోరిన మహిళల ఘటనల గురించి విన్నాం. మన దేశ స్వాతంత్ర్య సమరంలోను గాంధీ పద్ధతిలో రెండో చెంపను చూపి ఎదుటి వ్యక్తిలో పరివర్తనకు పాకులాడిన నిరసన విధానాల్ని చూశాం. దాడుల్ని ఎదుర్కొనేందుకు మానవహారాలతో ఎదురొడ్డిన సందర్భాలనేకం.

నిలువుటద్దాలతో...

అద్దపు నిరసనలు ఈ మధ్య ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్ నుంచి కెనడా వరకు నిలువుటద్దాల్ని నిరసనకారులు వాడుతున్నారు. వీటిలో తమ ప్రతిబింబాల్ని చూసి మరీ ఇంత క్రూరంగా ప్రవర్తిస్తోంది తామేనా అని సిగ్గు పడుతున్నవాళ్లు, కోల్పోయిన నిగ్రహాన్ని తిరిగి చేతుల్లోకి తెచ్చుకుంటున్న వాళ్లు, బేటన్ల్ని పక్కన పడేస్తున్న వాళ్లు ఉన్నారు. ఉక్రెయిన్‌లోని కీవ్‌లో జరిగిన ఓ నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వందలాది మందిని పోలీసులు చితగ్గొట్టడంతో వెనక్కు మళ్లిన ఉద్యమకారులు పోలీసులు ఊహించని విధంగా ఇలా అద్దాలతో ఎదురయ్యారు. సుమారు గంటపాటు వందలాది మంది మహిళలు అద్దాలతో బలగాల ఎదుట నిలబడి నిరసన తెలిపారు. ఇవి పెద్ద ప్రభావాన్నే చూపించాయి. దారుణ అణచివేత కాస్త రూట్ మారిపోయింది. ఇది రాజ్యానికి నచ్చక ఇప్పుడు ఉక్రెయిన్‌లో అద్దాల్ని నిరసనల్లో ఉపయోగించడాన్ని నిషేధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయట. వాటిని మారణాయుధాలుగా ఉపయోగించే అవకాశం ఉందని, అది హింసాయుత నిరసనకు దారి తీస్తుందనే బూచిని చూపిస్తున్నారు. ఈ విషయం అంతర్జాలం ద్వారా దావానలంలా వ్యాపించడంతో అద్దాల నిరసనకు మద్దతుదార్ల సంఖ్య ఒక్కపెట్టున పెరిగిపోయింది.

ఎల్లలు దాటి...

ఆ దేశాన్ని దాటి ప్రపంచంలోని ఇతర ఉద్యమాల్లోకి ప్రవేశించాయి అద్దాలు. ఫ్లవర్ పవర్ ఉద్యమం తర్వాత అంతటి బలీయమైన పోకడ ఇదని చాలామంది అంటున్నారు. ఎంత బ్రెయిన్ వాష్ చేసినంత మాత్రాన ప్రజలకు రక్షకులుగా ఉండాల్సిన వాళ్లే మానవత్వాన్ని మరిచి కర్కశంగా దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని నిలదీసేవాళ్లకు ఈ అద్దాలు మంచి ఉపకరణాలుగా మారుతున్నాయి. అమెరికాలోని ఫెర్గ్యూసన్ అన్‌రెస్ట్‌లోను ఈ అద్దాల నిరసన చేరిపోయింది. పోలీసు దమనకాండకు నిరసనగా అద్దాల్ని చేతబూనిన నిరసనకారులు దాడుల్ని ఎదుర్కొంటూనే మార్చ్‌లు నిర్వహించారు. కాలిఫోర్నియాలోని ఓక్‌ల్యాండ్‌లో ఈ తరహా ప్రదర్శనను 500 మంది నల్లజాతీయులు చేయడం సంచలనం సృష్టించింది. వార్తల్లో ప్రధానాంశమైంది. కేవలం అక్కడే కాదు అమెరికా అంతటా ఇలా అద్దాలు నిరసనల్లో తళుక్కుమన్నాయి. ఇక కెనడా విషయానికి వస్తే ఇవే అద్దాల్ని మరో రకంగా నిరసనకారులు వాడారు. ఎడ్మంటన్‌లోని ప్రభుత్వ కార్యాలయాలకు అద్దాలతో పెద్ద ఎత్తున చేరుకుని ప్రభుత్వ పాలనా తీరును ఓ సారి ఆత్మవిమర్శ చేసుకోమని, అది వారికి చేత కాకుంటే ఓ సారి బయటకు వచ్చి అద్దాల్లో చూసుకోమని పాలనతీరును వినూత్నంగా ఎండగట్టారు.

-జే

మనం ఫోన్ తీయగానే హలో అంటాం కదా అయితే దాని సృష్టికర్త అలెగ్జాండర్ గ్రాహంబెల్ మాత్రం 'అహోయ్' అని పలకరించేకమన్నాడు. అప్పట్లో ఓడల్లో నావికులు అహోయ్ అంటూ పలకరించు కునేవాళ్లు. అయితే థామస్ ఎడిసన్ 'హెల్లో' మాటను పరిచయం చేశాడు.



తెలుసా

29 ఏళ్లకే టెలిఫోన్‌ను ఆవిష్కరించిన గ్రాహం బెల్ 24 ఏళ్లకే మూగ, చెవిటివారికి ఓ విద్యాలయాన్ని ప్రారంభించాడు. 16 ఏళ్లకే ఆ తరహా ఓ బోర్డింగ్ పాఠశాల విద్యార్థులకు తరగతులు తీసుకునేవాడు.

టెలీగ్రఫీలో ఇంప్రూవ్‌మెంట్‌గా గ్రాహంబెల్ టెలిఫోన్‌కు పేటెంట్ తీసుకున్నాడు.

ఖనిజపు గని టన్ను మట్టిలో ఉండే దాని కన్నా టన్ను మొబైల్ ఫోన్లలో దొరికే బంగారం ఎక్కువట.

అహోయ్..
హల్లో హల్లో..

తొలి ట్రాన్సాట్లాంటిక్ టెలిఫోన్ కేబుల్‌ను 1956లోనే వేశారు. అట్లాంటిక్ సముద్ర గర్భం మీదుగా 12 వేల అడుగుల లోతులో కెనడా నుంచి స్కాట్లాండ్‌కు ఈ కేబుల్ కనెక్ట్ చేస్తుంది.

666 6666 అనే నంబర్‌ను 2007లో ఖతార్‌లో జరిగిన ఓ చారిటీ వేలంలో దాదాపు 8 కోట్లకు పాడారు.



తన తల్లి బధిరురాలు కావడంతో ఎలాగైనా ఆమెతో మాట్లాడాలని పలు ప్రయోగాలు చేస్తుండగా టెలిఫోన్ ఆవిష్కృతమైంది. తల్లికి తన మాటలు అర్థమవ్వాలని ఆమె నుదుటి వద్ద మాట్లాడేవాడు. ఆ మాటలు చేసే వైబ్రేషన్స్ ద్వారా ఆమె గ్రాహంబెల్ ఏమంటున్నాడో అర్థం చేసుకోగలిగేది.



ఇంట్లో ఫోన్ పెట్టించుకున్న తొలి వ్యక్తుల్లో ప్రఖ్యాత కవి, రచయిత మార్క్ ట్వైన్ ఒకరు.

2014 నాటికే ప్రపంచ జనాభా సంఖ్యను దాటేస్తూ మొబైల్ ఫోన్లు పోగుబడ్డాయి. అంటే దాదాపు 700 కోట్లపైనే ఉన్నాయన్న మాట.

'మీ ఫోన్ హోల్డ్‌లో ఉంచారు. దయచేసి వేచి ఉండండి." అని కాలర్ బిజీగా ఉన్నప్పుడు వినిపిస్తుంది.. హోల్డ్ అనే పదం వాడటానికి కారణం.. గ్రాహంబెల్ టెలిఫోన్ పరికరాన్ని ఇస్తూ హియర్, హోల్డ్ దిస్" అన్నాడట. మాట్లాడేందుకు ఫోన్‌ను మరొకరికి ఇస్తున్నప్పుడు ఇలా హోల్డ్ దిస్ అనడం పరిపాటై చివరకు ఇలా మారింది.

మొట్ట మొదటి ఫోన్ సంభాషణలో మాట్లాడిందిదే.. "మిస్టర్ వాట్సన్, కమ్ హియర్. ఐ వాంట్ సీ యూ." (వాట్సన్ గారు ఇక్కడికి రండి. మీతో పని ఉంది.) అని. పేటెంట్లకు అప్లై చేసిన రెండు రోజుల తర్వాత 1876 మార్చి 10న బోస్టన్‌లోని తన ల్యాబ్‌లో పనిచేస్తుండగా యాసిడ్ వాలికి గ్రాహంబెల్ మీద పడింది. అప్పుడు టెలిఫోన్ పరికరం దగ్గరున్న గ్రాహంబెల్ థామ్సన్ యథాలాపంగా పిలిచాడు. అవే పై మాటలు. అతడన్నమాట మరో గదిలో ఉన్న అసిస్టెంట్ థామస్ ఎ. వాట్సన్‌కు స్పష్టంగా రిసీవర్ గుండా వినిపించింది. ఇదే తొలి టెలిఫోన్ కాల్‌గా నమోదైంది.

మెదడును పాడుచేస్తుందని మొబైల్ ఫోన్‌ను వాడేందుకు భయపడేవారిది ఫ్రిజెన్నోఫోబియా.



అసహనం ఇప్పుడు అంతటా వినిపిస్తున్న మాట. ఎక్కడ ఏ చిన్నపాటి ఘటన జరిగినా మత ఘర్షణలతో అట్టుడికేంత సెన్సిటివ్‌గా ఉండే ప్రాంతాలకూ లోటు లేదు. భారత దేశమే కాదు దీనికి ఏ దేశమూ అతీతం కాదు. అయితే పాకిస్తాన్‌లో సైతం ఈ 'అసహనం' మాటే వినబడని గ్రామాలున్నాయి. అందులో మితీ ఒకటి. ఎక్కడ ఎవరు కొట్టుకు చచ్చినా ఇక్కడి హిందూ ముస్లింల స్నేహబంధం చెక్కుచెదరదు. ఆదర్శప్రాయంగా నిలుస్తున్న ఈ సింధూ ప్రాంత ప్రజలకు మతంలోని తీవ్రతను ఎక్కడ తుంచేసుకోవాలో బాగా తెలుసు.

'మితీ' సహనం

పాకిస్తాన్‌లో ముస్లింలు చాలా తక్కువగా వున్న పట్టణాల్లో మిథీ ఒకటి. సింధ్ ప్రావిన్స్ థార్పార్‌కర్ జిల్లాలోని మితీ పట్టణంలో ఎలాంటి అసహనపూరిత ఆగడాలు కనిపించవు.

ఎడారి ప్రదేశంలో ఉండే ఈ చిన్న ప్రాంతంలో హిందూ ముస్లింలిరువురూ అన్నదమ్ముల్లా పాకిస్తాన్ పుట్టుక నుంచీ కలసిమెలసి ఉంటున్నారు. అక్కడి హిందువులు రంజాన్ మాసంలో ముస్లింలతోపాటు ఉపవాస దీక్ష చేస్తారు. ముహర్రం సందర్భంగా ఊరేగింపును ముందుండి నడిపిస్తారు. సూఫీ తత్వం అందించిన సౌభ్రాతృత్వపు సంప్రదాయాలివి. కరువు సమస్య అధికంగా ఉన్న మితీకి చేరుకోవాలంటే 20 గంటల రైలు, రోడ్డు ప్రయాణం చేయాలి. అక్కడ అడుగిడగానే పాకిస్తాన్ పట్టణాల్లో అనుకున్నవేమీ కనిపించవు. ఇక్కడ జనాభాలో 80 శాతం మంది హిందువులే. ఇక్కడ హిందువుల సెంటిమెంట్‌ను గౌరవిస్తూ ముస్లింలు ఆవుల్ని వధించరు. ముస్లింల సంప్రదాయాల్ని గౌరవిస్తూ ముహర్రం మాసంలో పెళ్లిళ్లు ఇతర ఉత్సవాల్ని హిందువులు చేసుకోరు. రంజాన్ మాసంలో ముస్లింలకు అల్పాహారాన్ని, పానీయాల్ని హిందువులు ఏర్పాటు చేస్తారు. ఈద్, దీపావళి సందర్భంగా ఒకరికొకరు స్వీట్లను పంచుకుంటారు. అక్కడ క్రైమ్ రేట్ అత్యల్పం. ఇప్పటి వరకు మత అసహనానికి చెందిన ఘర్షణల జాడే లేదు. హిందూ ఆలయాల్లో పూజల సమయంలో అజాన్ కోసం లౌడ్ స్పీకర్లను వినియోగించరు. నమాజ్ చేస్తున్నపుడు గుడి గంటలు మోగించరు. రంజాన్ మాసంలో పబ్లిక్‌గా ఎవరూ ఆహారాన్ని భుజించరు. అలాగే గ్రామమంతా కలసి హోలీ వేడుక జరుపుకుంటారు. సింధ్ ప్రాంతం మత సామరస్యానికి ప్రతీకగా చెబుతారు. సింధ్ సూఫీ సంస్కృతి మత సహనానికి బహు మతాల అస్తిత్వానికి మంచి ఉదాహరణ మితీ.

'హ్యూమన్స్ ఆఫ్ పాకిస్తాన్'కు చెందిన నిజామ్, మామా విశాన్‌లు మితీలో ఓ సంక్షేమ సంస్థను నడుపుతున్నారు. రక్తదానం, అంబులెన్స్ వంటి అత్యవసర సేవల్ని మితీ ప్రజలకు అందిస్తున్నారు. వీరిద్దరి స్నేహానికి పాతికేళ్లు నిండాయి. ఈ ప్రాణమిత్రులే మితీలోని హిందూ, ముస్లింల స్నేహానికి ప్రతినిధులు. పాకిస్తాన్ అంటే తాలిబానైజేషనే అనుకునే వారు మితీని ఒక్కసారైనా చూసి రావాలి. పరస్పర విశ్వాసాల సామరస్యానికి మితీ ఓ కొత్త అర్థాన్నిస్తోంది. మిగతా చోట్ల ఉన్న మత అసహనం ఇక్కడి హిందూ ముస్లిం స్నేహాన్ని దెబ్బతీయలేదు. మతాలు విభేదిస్తాయి కానీ మనుషులు కాదు.



సీమ జన జీవన చిత్రణే 'రావణ వాహనం'

రాయలసీమ నేపథ్యంలో స్థానిక ప్రజల భాష, యాస, సంస్కృతికి ప్రతిబింబమే వేంపల్లి గంగాధర్ 'రావణ వాహనం' కథలు. ఈ సంపుటిలో 25 కథలున్నాయి. కథ, కథనం చక్కని శైలితో ఆకట్టుకునే చిన్నచిన్న కథలు. రచయితకు స్థానిక పరిస్థితులపై చక్కటి అవగాహన వుండడం కూడా అందుకు ఒక కారణం. ఈ పుస్తకంలోని కథావస్తువును వర్తమాన సామాజిక వాస్తవికతను రాయలసీమ నేపథ్యం నుండి విమర్శనాత్మకంగా, కళాత్మకంగా ఆవిష్కరించారు. ఈ పుస్తక రచయిత డాక్టర్ వేంపల్లి గంగాధర్ నవలా రచయిత, కథకుడు, విమర్శకుడు, సామాజిక చరిత్రకారుడు, అధ్యాపకుడు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని తెలుగులో మొదట అందుకున్న యువ రచయిత కూడా. ఈ సంపుటిలోని కథలన్నీ రాయలసీమ జీవిత మూలాలు రచయిత దృక్పథం నుంచి, ఆయన అన్వేషణ నుంచి జాలువారిన జీవన సత్యాలు. కరువు, కక్షలు కోణాన్ని స్పృశిస్తూనే వివిధ సామాజికాంశాలను ఇతివృత్తాలుగా తీసుకున్నారు. ఈ పుస్తకంలోని మొదటి కథ 'చీనీ చెట్లు'. ఈ చిన్న కథలోనే రాయలసీమ నేపథ్యాన్ని విశ్లేషించారు. రెండు గ్రూపుల మధ్య వున్న రాజకీయ, ఆర్థిక,

రావణ వాహనం కథలు
రచయిత: డా॥ వేంపల్లి గంగాధర్
పేజీలు:124/-
వెల:100/-
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
బండ్లగూడ, హైదరాబాద్

సామాజిక పోటీ మూడో పార్టీ రాకతో మలుపు తిరిగిన వైనం... ప్రస్తుత రాజకీయ వైచిత్రికి నిలువుటద్దం. మరో కథ 'ఏ ఊరికి ఏ దారి?'. "స్వామీ మీరిచ్చే పరిహారం వద్దు. మా పంట భూమి మాకుంటే సాలు. మీరు మా పల్లెదిక్కే రావాకండి..." అనే ఈ కథ చదువుతుంటే కొత్తగా ఏర్పడిన మన రాష్ట్రంలో రాజధాని కోసమనీ, ఎయిర్‌పోర్టుల కోసమనీ ఊర్లు, పొలాలపై ప్రభుత్వం దృష్టి సారించిన విధానం కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. ఫ్యాక్షన్ పడగ నీడలో చితికిపోతున్న పల్లెల దుస్థితికి అద్దంపడుతుంది 'రావణ వాహనం' కథ. 'మీ పల్లెలో ఫ్యాక్షన్ ఇంగా వుండాదా? అని మీసాలు దువ్వుకుంటా అడిగినాడు పోలీసు. ఏంజెపితే ఏమైతాదోనని సన్నోళ్లు నీళ్లు నమిలినారు'..., 'భయపడ్తా బతకలేం రా. తెగింపు వుండాల. ఎల్లకాలం వాడ్దే వుండడు. ఈసారి రాని కొడుకుల్ని ఉప్పు పాతరేస్తా..' వంటి సంభాషణలను ఈ కథ నేపథ్యాన్ని సులభంగానే అర్థం చేసుకోవచ్చు. ఈ కథలన్నిటిలో కాస్త విభిన్నంగా వుండే కథ 'నక్షత్ర తాబేళ్లు'. దట్టమైన లంకమల అడవిలో నక్షత్ర తాబేళ్లు కొండలో దండిగా వుండాయి. ఈ తాబేళ్లకు విదేశాల్లో మాంచి గిరాకీ. వాస్తు కోసం, ఇళ్లలో అందం కోసం వీటిని పెంచుకుంటూ వుంటారు. స్మగ్లర్లకు చేరవేస్తే అక్కడి స్థానికులకు వచ్చేది నూటాయాభై రూపాయలు. అదే తాబేళ్లను విదేశాల్లో లక్షకో, లక్షన్నరకో అమ్ముకుంటారు. ఒకవైపు స్మగ్లర్ల దోపిడీ, మరోవైపు పోలీసుల నిర్బంధాన్ని చక్కగా చూపించారు.మొత్తంగా చూసినప్పుడు రాయలసీమ జన జీవన జీవిత చిత్రణ, నేటి రాజకీయ వాస్తవ దృశ్యం ఈ కథా సంపుటిలోని కథలన్నింటిలోనూ అగుపిస్తుంది. సీమ గ్రామీణాన్ని అర్థం చేసుకోడానికి ఈ కథలు కొంత వరకూ ఉపయోగపడతాయి.

- రాజాబాబు కంచర్ల

ప్రేరణ, జీవితానుభవాల మేళవింపు

కథలకు ప్రేరణ చుట్టూ ఉన్న ప్రపంచం నుంచి వస్తుందనే అభిప్రాయాలున్నప్పటికీ.. మరికొందరు మాత్రం తమ జీవితానుభవాలనే కథలుగా మార్చగలిగే నేర్పు కలిగి ఉంటారు. ఆ ప్రేరణ, జీవితానుభవాలను మేళవించి ఇచ్చినట్లుగా ఉంటాయి రుద్రాభట్ల నరసింహారావు కథలు. సహజత్వం, సజీవత ఉన్న కథలు కలకాలం గుర్తుండి పోయేలా ప్రముఖ వార, మాస పత్రికల్లో ఈయన కథలు 14 ముద్రితం కాగా, కార్టూన్‌కి రావలసిన పారితోషికం, కాంతం – కనకం కథలు మాత్రం అముద్రితాలు. మొత్తం 16 కథలు చదివితే బోనస్ అన్నట్లుగా రుద్రాభట్ల విరచిత 'ఆదర్శ శిఖరాలు' నవలికను కూడా ఇదే కథా సంకలనంలో జోడించి ఇచ్చారు. 'పునరాగమనం' కథలో.. కడుపుతో ఉన్న భార్య సీతను, కొడుకును వదిలి వెళ్లిపోయిన బాపిరాజు ఇరవై ఏళ్ల తర్వాత తన వాళ్లను చూసేందుకు స్వగ్రామం చేరుకుంటాడు. తమ ఇంటి ముందు అరిటాకులు కోస్తున్న ఓ కుర్రాణ్ణి విశేషం ఏమటని వాకబు చేయగా.. ఈరోజు సీతమ్మ నెల మాసికం అని

రుద్రాభట్ల నరసింహారావు రచనలు,
రచన : రుద్రాభట్ల నరసింహారావు,
పేజీలు : 235
వెల : రు.150/-, ప్రతులకు :
నవచేతన, విశాలాంధ్ర, మరియు
ప్రముఖ పుస్తక కేంద్రాలు.

చెపుతాడు. భార్య మృతితో షాక్‌కు గురైన ఈయన ఎవరో తెలియక పోయినా కూతురు, కొడుకు ఈయనకు సపర్యలు చేస్తారు. తాను తండ్రి అని తెలిస్తే అసహ్యించుకుంటారని ఓ ఉత్తరం రాసి వెళ్లిపోతాడు. ఉత్తరం చూసిన పాతికేళ్ల కొడుకు తండ్రి వద్దకు వెళ్లి 'నాన్నా.. అని హత్తుకుని పదండి' అంటూ ఇంటికి తీసుకు రావడాన్ని హృద్యంగా వర్ణించారు రచయిత. 'చదువుతున్నపుడు హృదయం ద్రవించాలి. కళ్లు చమర్చాలి. మేను పులకించాలి. జ్ఞాపకాల దొంతరలు కదలాలి...' అదీ కథంటే అనుకునే మరికొన్ని కథలు ఈ పుస్తకంలో ఉన్నాయి. రచయిత తన జీవితాన్ని సుతారంగా, నిశ్శబ్దంగా పరుచుకున్న భావన ఇవి చదివిన వారికి తట్టక మానదు. స్త్రీ ఔన్నత్యాన్ని, మానసిక సౌందర్యాన్ని 'ఆదర్శ శిఖరాలు' నవలికలో చూపారు రుద్రాభట్ల. ఆత్మకథా శిల్పంలో రాసిన స్వీయ జీవితమే దీని ఇతివృత్తం... సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్‌లో ప్రవేశం కోసం రఘురామయ్య ఇంటికి వస్తాడు కామేశ్వరరావు. ఇతను తన ప్రాణ స్నేహితుడు భగవాన్లు కొడుకేనని తెలుసుకుని ఆశ్రయమిస్తాడు రఘురామయ్య. పెళ్లీడుకొచ్చిన కూతురు భానుమతిని కామేశ్వరరావుకు ఇవ్వాలనే తలంపు కూడా ఉంది. కథాకాలం కొన్ని నెలలు సాగినా కామేశ్వరరావు టీచర్ ట్రైనింగ్‌లో చేరిందీ, లేనిది లేకపోవడం ఈ నవలికలోని వెలితి. కథ సుఖాంతం అయిందని నేరుగా కాకుండా ముగింపును విభిన్నంగా ఇవ్వడం కొత్తదనాన్ని సూచిస్తోంది. రచయిత జీవించి ఉన్న కాలంలోనే పుస్తకంగా రావలసిన ఈ కథలు పాతికేళ్ల తదనంతరం రావడంతో కొన్ని పదాలు పాత వాసనలను కలిగిస్తాయి. 50–60 వరకు కథలు అచ్చయినా వాటిని రచయిత సేకరించుకోలేదు. వాటిలో కొన్ని కటింగ్‌లను దాచుకున్న కొందరి సహకారంతో వివిధ మానవీయ కోణాలున్న ఈ కథా సంకలనాన్ని వెలువరించడం అభినందనీయం.

-టి.డి

హ్యాండిల్ బార్ మీదుగా ప్రపంచం మెల్లిగా కదిలిపోతుంటే.. మెత్తగా గాలి వీనుల్ని తాకుతూ మంద్రమైన శబ్దం చేస్తుంటే.. పర్వతాలు, మైదానాలు, నదీ సంగమాలు, సుదూరాన కనీకనిపించని ఊర్లు ఒక్కొక్కటిగా ద్వారాలు తెరుస్తున్నట్టు స్లైడ్ అవుతుంటే.. డాక్టర్ స్టీవెన్ ఫేబ్స్ మరో మైలును పిక్కల కష్టం తెలీకుండా దాటేస్తాడు. సైకిల్ మీద ఆరు ఖండాల్ని ఆరేళ్లలో దాటిన ఈ ఒంటరి ప్రయాణీకుడు 54 వేల మైళ్ల యాత్రలో మనిషిని లోతుగా పరిశీలించడానికి... ప్రపంచాన్ని నిశితంగా గమనించడానికి ప్రయత్నించాడు. తానూహించిన దాని కంటే ప్రపంచం, మనిషీ ఇరువురూ అద్భుతంగా ఉన్నారని చెబుతున్నాడు. ఫేబ్స్ ప్రపంచ యాత్ర ఫేబుల్‌లా అనిపించినా అదో వాస్తవాల కథ.

ఆరు ఖండాల సైకిల్ సవారీ

లండన్‌లోని సెయింట్ థామస్ హాస్పిటల్‌లో వైద్యుడిగా మంచి జీతం, జీవితం. ఎంతో మంచి స్నేహితుల బృందం, మూడు పదుల్లోకి రాకుండానే సొంత విల్లా. చాలా నింపాదిగా, తేలిగ్గా, హాయిగా సాగిపోతోంది కాలం. అందుకే మాట్లాడితే లండన్ బ్రిడ్జి వ్యూపాయింట్‌లో ఉండే ది జార్జ్ అనే బీర్ గార్డెన్ పబ్‌లో మిత్రులతో హంగామా చేసేవాడు ఫేబ్స్. 2008లో ఏ రోజో సరిగ్గా గుర్తులేదు కానీ అదే పబ్‌లో మిత్రులకు టోస్ట్ చెబుతుండగా అనాలోచితంగానే ఓ మాట నోటజారింది. 'జీవితం చాలా బోర్ కొడుతోంది. ప్రపంచాన్ని చుట్టేస్తే గానీ ఈ బోర్‌డమ్ నుంచి బయటపడలేనేమో' అంటూ ఫేబ్స్ కుర్చీలో కూలబడ్డాడు. అక్కడున్న ఓ అట్లాస్‌పై పెన్‌తో యథాలాపంగా ఓ రూట్ మార్క్ చేశాడు. 'ఓ సూపర్..' అంటూ మిత్రులు కెవ్వుకేకలు పెట్టారు. 'ఎపుడు ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసుకుంటున్నావ్?' అన్నాడొకడు. 'ఫ్లైట్ ఏంటి నేనెళ్లాలనుకుంటోంది సైకిల్ మీద...' అనగానే అందరూ అవాక్కయ్యారు. దాదాపు రెండేళ్ల పాటు ప్లాన్ చేసుకున్నాడు. బాధ్యతల్ని మీదేసుకున్నాడు. ఏదో సరదాగా షికారుకెళ్లినట్టు కాదు. దారిన ఎదురయ్యే ఆస్పత్రుల్లో సేవలు అందిస్తూ, మారుమూల ప్రాంతాల్లో వైద్యం చేస్తూ మెడికల్ ఎమర్జెన్సీ రిలీఫ్ ఇంటర్నేషనల్‌కు నిధులు సేకరిస్తూ..రూట్ మ్యాప్ సిద్ధం చేసుకున్నాడు. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాక 3 మ్యాట్లు, 3 బెడ్లు, ఓ చిన్న గుడారం, చికిత్స పరికరాలు, రెండు మూడు జతల దుస్తులు, ఇతర అత్యవసర వస్తువుల్ని సర్దుకుని స్పేర్ టైర్‌తో సైకిల్ ఎక్కాడు. తాను పనిచేస్తున్న సెయింట్ థామస్ ఆస్పత్రి వద్ద కుటుంబీకులు, సహచరులు, మిత్రులు, సన్నిహితుల వీడ్కోలు తీసుకుని పెడల్ తొక్కడం మొదలెట్టాడు. ఓ 50 యార్డ్‌లు తొక్కాడో లేదో ఎంతో ఉద్విగ్నతకు లోనయ్యాడు. ఇక ముందుకు కదలడం భారమైంది. వెంటనే రూట్ మార్చి తన ఫేవరెట్ పబ్‌కు వెళ్లి కంట తడితో బొంగురు పోయిన గొంతుతో మిత్రులకు ఫోన్ చేశాడు. ఇదంతా వదిలేసి ఎప్పుడు ఎలా జీవితం టర్న్ అవుతుందో, ఏ ప్రమాదం ఎలా ఎదురవుతుందో, అసలు ఆరు ఖండాలు కాదు ఆరు ఊర్లయినా తిరిగి రాగలనా అంటూ భావోద్వేగాన్ని పంచుకున్నాడు. ఇంగ్లండ్ జీవితం తప్ప మరే ఇతర విషయం తెలీని తను డిఫరెంట్ పరిస్థితులకు తట్టుకోగలనా అని ప్రశ్నించుకున్నాడు. కానీ ఇంత ప్లానింగ్, ఇంత హడావిడి చేసి ఇలా తిరుగు ముఖం పట్టడం జీవితంలో ఎప్పటికీ వీడని ఫెయిల్యూర్‌గా హ్యాలూసినేట్ చేస్తుందని ధైర్యాన్ని తెచ్చుకున్నాడు. డ్రగ్స్ మాఫియా, ఆర్గాన్ మాఫియా, దొంగలు, ఆటవిక దాడులు, వ్యాధులు, జాతి వైరాలు, కిడ్నాప్ ముఠాలు ఇలా ఎన్నో భయాలు మదిలో మెదులుతున్నా లండన్ దాటేసి కెంట్‌లో పడ్డాడు.

మనసు డైరీలో..

డెడ్ లైన్లకు, షెడ్యూళ్లకు అతీతంగా ప్రపంచంలో తప్పిపోవాలనే ఆకాంక్షతో బయలుదేరిన ఫేబ్స్ వింత అనుభూతులకు లోనయ్యాడు. సహారా ఎడారి, ఆల్ప్స్ పర్వత శ్రేణి, హిమాలయ మంచు ఫలకాలు, ఆఫ్రికా దండకారణ్యాలు, సముద్ర తీరాలు, ఉప్పు కయ్యలు, మహానగరాల స్కైలైన్‌లు దాటే యత్నంలో ఎంత వేగంగా సైకిల్ తొక్కుతున్న ల్యాండ్‌స్కేప్‌లన్నీ అస్సలు కదలనట్టు, మారనట్టు గంటల తరబడి నిలిచినట్టవడంతో రోజుల పాటు శూన్యం కమ్ముకునేదని, ఆ సమయంలో ఏమీ తోచేది కాదని, ఒంటరితనం బాగా గుర్తొచ్చేదని ఫేబ్స్ అనుభూతుల్ని పంచుకున్నాడు. ఆ విరామంలేని ఒంటరితనాన్నే తన గురించి లోతుగా తెలుసుకునే ఏకాంతంగా, తనతో తాను చర్చించుకునే తావుగా మార్చుకున్నాడు. మ్యూజిక్ వింటూనో, మనస్సులోనే

డైరీ రాసుకుంటూనో సైకిల్‌ను నడిపించేశాడు. రోజుకు 40 – 100 కి.మీ.ల చొప్పున సైకిల్ తొక్కుతూ ముందుకు కదిలిన ఫేబ్స్ మధ్యప్రాచ్యం మీదుగా యూరప్‌ను దాటి ఆఫ్రికా చేరాడు. అక్కడి నుంచి దక్షిణ అమెరికాకు ఫ్లైట్‌లో వెళ్లి మళ్లీ సైకిల్ యాత్ర మొదలెట్టాడు. అలా మధ్య అమెరికా గుండా ఉత్తర అమెరికా ఖండాన్ని అలాస్కా టండ్రాల వరకు తొక్కేశాడు. అక్కడి నుంచి ఆస్ట్రేలియా చేరుకుని ఇండోనేషియాల మీదుగా ఆసియాలో యాత్ర కొనసాగించాడు. మసీదులు, ఆలయాలు, చర్చ్‌లు, బౌద్ధారామాలే కాకుండా పోలీస్ స్టేషన్‌లు, స్కూళ్లు, బోర్డర్ చెక్‌పోస్ట్‌లు కూడా ఆశ్రయమిచ్చాయి. అయితే ఈ సౌకర్యం కొన్ని మైళ్లకే.. వందలాది రాత్రులు నిర్మానుష్య ప్రాంతాల్లో గుడారంలో ఒక్కడే గడిపాడు. ఈజిప్ట్‌లో కుర్రాళ్ల గుంపొకటి ఓ రాత్రి దాడి చేసి దోపిడీకి ప్రయత్నించింది. ఈక్వెడార్‌లో మత్తుకు బానిసైన ఓ యువకుడు కత్తితో పొడిచాడు. ఇథియోపియాలో ఓ వ్యక్తి నిద్ర లేపి గన్ పాయింట్ బ్లాంక్‌లో పెట్టాడు. నిష్ఠ దారిద్ర్యంతో అల్లాడే ఆ ప్రాంతానికి చెందిన ఓ కుటుంబ పెద్ద అతడు. ముగ్గురు పిల్లలు, భార్యను పోషించుకోడానికి తనకే మార్గం లేదు. ఫేబ్స్ అతడి పరిస్థితి అర్థం చేసుకున్నాడు. బాధల్ని పంచుకున్నాడు. చివరకు ఎవరైతే హతమార్చేందుకు వచ్చారో అదే వ్యక్తి ఇంటికి తీసుకెళ్లి ఓ బౌల్ వేడివేడి సూప్‌ను అందించి ఆతిథ్యమిచ్చాడు. ఫేబ్స్ తన వల్ల కాగల సాయాన్ని చేసి ఆ కుటుంబం నుంచి వీడ్కోలు తీసుకుని మళ్లీ ప్రయాణం కట్టాడు. రోజుల తరబడి వేడినీటి స్నానం లేకుండా కడుపు నిండా తిండి లేకుండా గడిపేశాడు. గుడారంలోకి ఒకసారి 9 అడుగుల తాచుపాము దూరింది. తేళ్లు, విషపు సాలీళ్లతో సహవాసానికి లెక్కలేదు. దారిన ఎదురైన సింహాన్ని కళ్లారా చూసిన సందర్భాన్ని మరిచిపోలేదు. వాతావరణం కూడా ఫేబ్స్‌కు తన రెండో ముఖాన్ని చూపించింది. మంగోలియాలో యాత్ర చేస్తుండగా ప్రపంచంలోనే అతి విపరీత పరిస్థితులుండే యులెన్‌బేటర్ చేరుకున్నాడు. స్థానికులు పిలుచుకునే 'జుడ్' అనే తీవ్ర చలి కాలంలో చిక్కుకున్నాడు. పగళ్లే మైనస్ 15 డిగ్రీల ఉష్ణోగ్రతలుండే ఆ సమయంలో తాగడానికి నీరుండేది కాదు. ఓ సారి గడ్డకడితే ఇక కరగడం



కష్టమే. ఆ చలికి జుడ్ అనే పేరెందుకంటే ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఉండే జంతువులు పెర్మాఫ్రాస్ట్ వల్ల చనిపోతాయి. శిలల్లా గడ్డకట్టుకుపోతాయి.

ఫేబ్స్ రోజుకు పది డాలర్ల చొప్పున ఖర్చు చేసినా మూడేళ్లకే డబ్బులు నిండుకున్నాయి. అప్పటి నుంచి ఫ్రీల్యాన్స్ రైటర్‌గా పలు మేగజైన్లకు రాస్తూ, 'సైక్లింగ్ 6' పేరిట బ్లాగ్ నడిపిస్తూ నెట్టుకొచ్చాడు. మలేషియాలో డెంగ్యూ జ్వరానికి లోనవడంతో కీళ్లనొప్పులతో అవస్థలు పడ్డాడు. ఓ ప్రమాదం వల్ల మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అయినా తాను పెట్టుకున్న టార్గెట్‌లో 73 దేశాల్ని దాటేశాడు.

దేశాలే చిన్నబోయాయి

ఏయే దేశాలు తిరిగాడో ప్రస్తావించడానికి చిన్నబోయేంతగా యాత్ర తీరు సాగింది. అందుకే ఖండాలతోనే రూట్ మాట్లాడింది. ఏ ప్రాంతంలో అడుగెట్టినా, ఏ జాతితో మాట కలిపినా తెలుసుకుంది ఒకటే అది మనుషులంతా ఒకటే.

వారి మనసులంతా ఒకటే. ఆలోచనలు, ఆప్యాయతలు, ఆక్షేపణలు, అవసరాలు, అంతరంగాలు, అనురాగాలన్నీ అప్రకటితంగా ఒకేలా ఉన్నాయనే ఉద్దేశం కలిగింది ఫేబ్స్‌కు. 'తేడాలు... వైరుధ్యాలు... కల్పించుకున్నవే! అవకాశవాదులు కలుగజేసుకున్నవే!' అని చెబుతాడు. ఇంత సునిశితంగా ప్రపంచాన్ని దర్శించడం మిగతా ప్రయాణాల వల్ల సాధ్యం కాకపోవచ్చునేది ఫేబ్స్ మాట. దెబ్బతిన్న దారుల్లో ఆహ్వానం పలకని కుగ్రామాలకు సైకిల్ ద్వారానే వెళ్లగలిగానని అంటాడు. 25 టైర్లు, 12 సైకిల్ చైన్లు, 200 పంక్చర్లు ఇవీ రిపేర్ లెక్కలు. దారి పొడవునా పలు ఆస్పత్రుల్లో, క్యాంపుల్లో, యూనిట్లలో వైద్యం చేసుకుంటూ వందలాది మందికి చికిత్స చేశాడు. సహవైద్యులతో నైపుణ్యాల్ని పంచుకుని అనేక వ్యాధులు, సమస్యలపై అపారమైన అనుభవాన్ని గడించాడు. కాంబోడియాలోని ఓ నదీపాయలో తేలియాడే పడవ చికిత్స కేంద్రంలో సేవలు అందించాడు. థాయ్‌లాండ్, మయన్మార్‌లోని టీబీ క్లినిక్‌ల్లో పనిచేశాడు. బహిష్కరించిన కేరెన్ కమ్యూనిటీకి

చెందిన హెచ్ఐవీ బాధితుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చాడు. కాట్మండులో ఓ మొబైల్ క్లినిక్ ద్వారా లోయ ప్రాంతాల్లోకి వెళ్లి కుగ్రామాలకు వైద్య సహాయం చేశాడు. భయకంపితమైన ఆ గ్రామాల్లో కుష్టు రోగంపై అవగాహన కల్పించాడు. మత్తుకు బానిసలైన టీనేజర్లకు అలవాటు నుంచి బయటపడటంలో ఎన్జీవోలతో కలసి కృషి చేశాడు. కానీ ఓ ఘటన మాత్రం గుండె కోతను మిగిల్చింది. చిక్కిశల్యమైన ఓ మహిళ మరణం అంచుల్లో ఉంటే చూస్తు ఉండటం తప్ప ఏం చేయలేకపోయాడు.

వెలకట్టలేని..

ఎన్ని ప్రయాసలు, సవాళ్లు, ప్రమాదాలు, సమస్యలు, కష్టాలు, బాధలు, కన్నీళ్లు, గుండె కోతలున్నా ఈ యాత్ర అద్భుతమంటాడు ఫేబ్స్. ఆత్మీయంగా చూసుకున్న ఎన్నో కుటుంబాలకు రుణపడి ఉన్నానంటాడు. మెక్సికోలోని లగునా సాన్ ఇగ్నేసియాను చూసిన అవకాశం ఈ యాత్ర చలువే. చిలీ అర్జెంటీనాల మధ్య ఉండే ఏడాదిలో 35 రోజులు మాత్రమే తెరుచుకునే పర్వత శ్రేణి మధ్య దారి పాసో పిర్యాస్ నెగ్రాస్‌ను దాటాడు. భూమ్మీదే అతి విస్తారమైన బొలీవియా ఉప్పు కయ్యలు సాలార్ డి వుయునీని చూడగలిగాడు. దక్షిణాఫ్రికాలోని నార్తర్న్ కేప్‌కు చేరుకోగలిగాడు. శిథిలం కానీ సిరియాను చూసొచ్చాడు. భారత్‌లోని వైవిధ్యాన్ని దర్శించానని అన్నింటికంటే వెలకట్టలేని అనుభూతి మాత్రం జార్జియాలో పలకరించిందని ఫేబ్స్ పంచుకున్నాడు. శిశిర కాలంలో జార్జియా ఉత్తర ప్రాంతంలోని సావెంటీ పర్వతలోయ ప్రాంతాన్ని దాటుతుండగా ఐదే రోజుల్లో వృక్షాలన్నీ ఆకురాల్చి కనుచూపు మేరంతా భూభాగం తుప్పు పట్టినట్టుగా ఎర్రటి వర్ణంతో నిండిపోయింది. మరి కొన్ని రోజుల్లో లండన్ చేరుకోబోతున్నాడు ఫేబ్స్. జార్జ్ బీర్ గార్డెన్‌లో లండన్ బ్రిడ్జిని చూస్తూ మిత్ర బృందానికి ఈ సారి టోస్ట్ చెప్పే ఫేబ్స్ మాత్రం ఆరేళ్ల కిందటి ఫేబ్స్ కానే కాదు.

– అనన్య ప్రసిద్ధ్

వింత లోకం

పాన్సో కన్నీటి కౌగిలి..



న్యూయార్క్ బ్లడ్ సెంటర్ సంస్థ వివిధ వైద్య ప్రయోగాల కోసం ఆఫ్రికా ఐవరీ కోస్ట్ నుంచి 65 చింపాంజీలను తెచ్చారు. పదుల ఏళ్ల పాటు హెపటైటిస్ తదితర ప్రయోగాలకు వాటిని ఉపయోగించారు. బయాప్సీలు, వైరస్‌ను ఎక్కించడం వంటి అనేక హింసల్ని అవి చవిచూశాయి. చివరకు 20 చింపాంజీలే మిగిలాయి. వీటిల్లో పాన్సో ఒకటి. ఇక పనికిరావనుకున్నాక వాటిని వివిధ దీవుల్లో వదిలేశారు. అక్కడ అనువైన ఆహారం, వాతావరణం లేకపోవడంతో విడిచిన తొమ్మిది నెలల్లోనే 11 చింపాంజీలు మృతిచెందాయి. పాన్సాయ్‌ను దాని సహచరి ఇద్దరు బిడ్డలను ఒక దీవిలో వదిలేశారు. కొన్నాళ్ల పాటు ఆ సంస్థ తిండిని అందించి తర్వాత తమ బాధ్యత కాదని చేతులు దులుపుకుంది. కొత్తగా చేరిన వీటిని గుర్తించిన స్థానికుడు జెర్మైన్... పాన్సో కుటుంబం ఆహారం లేక విలవిల్లాడిపోవడం గమనించాడు. తానే రోజూ ఆహారాన్ని అందిస్తూ వస్తున్నాడు. అయితే 2013 నాటికి ఆ దీవి పరిస్థితులకు మనలేక పాన్సో తప్ప మిగతా కుటుంబమంతా చనిపోయింది. అప్పటి నుంచి ఒంటరితనంతో పాన్సో వేదన అనుభవిస్తోంది. ఈ మధ్య చింపాంజీ కన్సర్వేషన్ సెంటర్ డైరెక్టర్ ఎస్టెలె రాబాల్లాండ్ పాన్సో గురించి తెలిసి అక్కడకు వెళ్లింది. ఆమెను చూసి చూడగానే సంతోషంతో కన్నీళ్లు పెట్టుకున్న పాన్సో గట్టిగా కౌగిలించుకుని చాలాసేపు వదల్లేదు. అన్నేళ్లపాటు మనుషుల ప్రయోగాలకు చిత్రవధలు అనుభవించి కుటుంబాన్ని కోల్పోయినా ఎక్కడో మూల మనిషనేవాడిపై ప్రేమను మిగుల్చుకున్న పాన్సో కథ చాలామంది హృదయాల్ని కదిలించింది. దానితో పాటు మిగతా దీవుల్లో వదిలిన చింపాంజీల తిండి, సంరక్షణ కోసం 'ఎస్‌వోఎస్ పాన్సో' పేరిట క్రౌడ్ ఫండ్ సమీకరించి సాయం చేయడానికి సిద్ధమయ్యారు.



అది 1986...

ముప్పై ఏళ్ల కిందట వెర్నాన్ బర్టన్ ఓ అమ్మాయిని చూశాడు. దక్షిణాది ఇంగ్లండ్‌లో న్యూ ఫారెస్ట్ ప్రాంతంలో ఓ డబుల్ డెక్కర్ బస్‌లో ప్రయాణిస్తుండగా ఆ సుందరి వెర్నాన్‌కు ఓ ఓర చూపు విసిరింది. అంతే...ఆమె కళ్లలోని వలయాల్లో మనోడు పడిపోయాడు. ఇన్నాళ్లు ఆమె ఊహలతోనే ఎలాగోలా గడిపేశాడు కానీ ఆ కలల రాణిని అస్సలు మరచిపోలేక సతమతమవుతున్నాడు. కనిపించిన ప్రతి ఒక్కరితో... 'అది 1986... యూకేలో సెలవులు గడుపుతూ.. సోలెంట్ బ్లూ లైన్ బస్‌లో.. మౌజ్‌హోల్ లేన్ నుంచి సౌతాంప్టన్ సిటీ సెంటర్‌కు వస్తుండగా.. ఎదురుగా వస్తున్న మరో డబుల్ డెక్కర్ బస్సులో... నా అందాల దేవత చూపు కలిపింది..' అంటూ తన తొలిచూపు ప్రేమను చెబుతున్నాడు.. ఎవరైనా తన జాడ చూపిస్తారని. కానీ... ఇన్నేళ్ల తర్వాత ఎలా? అప్పుడే వెతకాల్సింది అంటే.. అప్పటికే ఒకరు తనతో బంధం ఏర్పరచుకోవడంతో ఏమీ చేయలేకపోయానని చెబుతున్న వెర్నాన్ ఇప్పుడు ఒంటరి. అందుకే చేజారిన తన ఆ పాత ప్రియురాల్ని వెదుకుతూ అప్పటి బ్లూ లైన్ ఇప్పటి బ్లూ స్టార్ బస్సులంతటా అప్పటి తన ఫొటో ఉన్న పోస్టర్లని స్టోరీతో కలిపి వేయించేశాడు. అంతటా తిరుగుతూ అందర్నీ తన స్టోరీతో తడుతున్నాడు. ఆ మిస్టరీ లవ్ గురించి ఈ ఒక్క క్లూ మాత్రం ఇవ్వగలుగుతున్నాడు.. తన జుత్తు నల్లటి నలుపట, ముదురు రంగు టాప్ వేసుకుందట. ఆమెతో యూనిఫామ్‌లో ఉన్న ఇద్దరు స్కూల్ పిల్లలున్నారట.

బ్యాంకర్లు నిషిద్ధం

"కుక్కలకు వెల్‌కమ్, బ్యాంకర్లు నిషిద్ధం (లేకుంటే 70వేల యూరోలు) ప్రవేశ రుసుం కట్టి రావొచ్చు)" ఇదీ ప్యారిస్‌లోని 'లెస్ యుక్యురీస్ డి రిచెలీయూ' అనే రెస్టారెంట్ ముందున్న నోటీస్ బోర్డ్. దాని ఓనర్ అలెగ్జాండ్రె కాల్లెట్‌కు చెప్పలేనంత అసహ్యం, పట్టరానంత కోపం బ్యాంకర్లంటే. ఇంకో రెస్టారెంట్ ఓపెన్ చేసుకుంటాను... లోన్ ఇవ్వండర్రా అని పదుల బ్యాంకుల చుట్టూ తెగ తిరిగాడు. తాను అర్జీ పెట్టుకున్న 70 వేల యూరోలను ఇచ్చేందుకు అందరూ తిరస్కరించారు. 3 లక్షల యూరోల టర్నోవర్ ఉన్న తన రెస్టారెంట్‌కు మిచెలిన్ ర్యాంక్ కూడా వచ్చినా బ్యాంకర్లు లోన్ ఇవ్వకపోవడంతో ఆయన కోపం నషాళానికి ఎక్కింది.



అదే, నీవన్న దళితుడ్ని

ముందుగా నేను మనిషిని
పుట్టాక కులం కుంపటి తగిలించబడినవాడ్ని
ఎందుకో, ఎంత లాభం కోసమో 'మను'
వారసులకే తెలుసు
నేను శ్రమ తెలిసిన వాడ్ని, శ్రమను మాత్రమే
నమ్మిన వాడ్ని
ఈ దేశ సిసలైన మూలవాసిని
ఊరికి నన్ను దూరంగా ఉంచినా, నా
ప్రతిభను ఉంచలేరని తెలిసినవాడ్ని
ఈ సృష్టికే సంపద సృష్టికర్తను నేనే
అవును, నువ్వన్నది నిజమే నేను దళితుడ్నే
డప్పు కొట్టి మంచి వార్తను చేరవేస్తా
నీ చెప్పు కుట్టి నీ నడక మారుస్తా
శుద్ధి చేసే పారిశుధ్య కార్మికుడ్ని
స్వచ్ఛ భారత్‌కి తొలి వారసుడ్ని నేనే
చెమట చుక్కలు నాటి, నీకు బువ్వ పెట్టేది
నేనే
నాకు కలుపుకోవటం తెలుసు
ప్రేమించడం తెలుసు, గౌరవించడం మహా
బాగా తెలుసు
నీలా తీసి వేయడం, భాగించడం చేతకాని
వాడ్ని
చేలోనైనా, చెరలోనైనా జీవించగల్గిన వాడ్ని
వేల, వేల సార్లైనా ఇలాగే పుట్టాలనుకునే
గుండె ధైర్యం కలవాడ్ని
అదే 'నీవన్న' దళితుడ్ని

- అమర్లపూడి కళ్యాణ్ కుమార్
సెల్: 8341136796





ఈ ప్రశ్నకు బదులేది

ప్రశ్న ఒకరికి ఆయుధం
ఒకరికి శరాఘాతం
ఒకరికి శుభాశీస్సు
ఒకరికి మరణ మృదంగం!
ప్రశ్నకు విరామం లేదు
నడుస్తుంది మాట్లాడుతుంది
చర్చలకు తావిస్తుంది
ఒక ప్రశ్నకు వంద జవాబులు
ప్రశ్నకు భయపడితే
జవాబులు వక్రీకరణలు!
ప్రశ్న ఉద్యమం
సత్యాగ్రహం చేస్తుంది
ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంది
అరెస్టు అవుతుంది
రిమాండుకు పంపబడుతుంది
పోలీసు కస్టడీకి నెట్టబడుతుంది
కోర్టులో డిఫెన్స్ అవుతుంది!
ప్రశ్న బాధితుడి నేస్తం
అధికారికి ఆగ్రహం
యజమానికి అక్కసు
ప్రభుత్వానికి అసహనం
విదేశీ హస్తమంటూ
ప్రశ్నలపై ఆరోపణలు
స్వదేశీ కుట్రంటూ
ప్రశ్నలపై విచారణలు
గర్జించి రణభేరి
ప్రశ్నకు పరాక్రమం
పెట్రేగిన రంకెలు
ప్రశ్నకు పునాది
ప్రశ్నలు మౌఖికంగానూ
కాగితంగానూ
శంఖం పూరిస్తూ
భేరి మోగిస్తూ
ఖణేళ్ మంటాయి!!
ఒక ప్రశ్న భూగోళమంత
విస్తృతం
ఒక ప్రశ్న ఖగోళమంత విశాలం
మహాత్ముని ప్రశ్నకు జవాబు
సత్యాహింసలు
కారల్ మార్క్స్ ప్రశ్నకు జవాబు
శ్రామిక జన కళ్యాణం
హిరణ్య కశిపుడి ప్రశ్నకు
విష్ణుమూర్తి ప్రత్యక్షం
పాంచాలి ప్రశ్నకు
కురుక్షేత్ర యుద్ధం!

- అడిగోపుల వెంకటరత్నమ్
సెల్: 9848252946

◆ కథ



గీతను మార్చిన రాత

- చాడా లలితాదేవి

మధ్యాహ్నం భోజనానికి వచ్చి, టీవీని చూస్తున్న రాజేష్ ఎవరో తలుపు తట్టిన చప్పుడు విని, కుర్చీలోంచి లేచి వెళ్ళి తలుపు తెరిచాడు. ఎదురుగా కొరియర్ బాయ్ చేతికొక కవరిచ్చి, సంతకం పెట్టించుకొని వెళ్ళిపోయాడు.

"నాకెవరూ కొరియర్ పంపేవాళ్ళు లేరే? అనుకుంటూ ఫ్రమ్ అడ్రసు చూశాడు. 'అనామిక' అని మాత్రం ఉంది.

"ఈ పేరెప్పుడూ విన్నట్టు లేదే!" అనుకుంటూ కవరు చించాడు. లోపల చిన్న ఉత్తరం. చివర సంతకం అదే. "నాన్న" అన్న సంబోధన చూసి ఆశ్చర్యపోయాడు.

"నాన్నా" ఎక్కడిదీ పిలుపు? నన్నలా పిలిచేవాళ్ళెవరూ లేరే" అని అనుకుంటున్నావు గదూ? నేను నీ పాపను నాన్నా! అవును నీ పాపనే! అయ్యో జ్ఞాపకం రావడం లేదా

నా పేరన్నా చెప్పి జ్ఞాపకం చేద్దామంటే, నా కసలు పేరే లేదాయె! మీరు ఏ పేరు పెట్టలేదు-పెట్టకుండానే నన్ను వదిలించుకున్నారాయె.... అదే... నాన్నమ్మ... నన్ను చంపేసిందిగా!

ఓ! నీకా సంగతి తెలియదు కదూ? కాని నేను నిజం చెపుతున్నాను నాన్నా! తనూ ఒక ఆడదే అయినా నాన్నమ్మకు ఆడపిల్లలంటే ఎందుకిష్టముండదో; నాకైతే అర్థం కావడం లేదు. మరి నీ సంగతి నాకు తెలియదు.

నేను పుట్టిన మూడు రోజులకే దవాఖానా నుండి అమ్మను, నన్ను ఇంటికి తీసుకొచ్చారన్న సంగతి నీకు గుర్తుండే ఉంటుంది. ఆ మర్నాడు నువ్వేమో ఆఫీసుకు వెళ్ళిపోయావు. పక్కింటి నర్సమ్మత్త స్నానం చేయిస్తానని అమ్మను బాత్‌రూమ్‌కి తీసుకెళ్ళింది. అప్పుడే నాన్నమ్మ నా దగ్గరకొచ్చి.....

"ఆరుగురు ఆడముండలను కని అష్టకష్టాలు పడ్డాను. మళ్ళీ నా కొడుకు పాలిట నువ్వు దాపురించావా?" అంటూ నోరు తెరిపించి గొంతులో ఏవో వేసింది.

అబ్బ! ముళ్ళలా గుచ్చుకుంది. ఏడుద్దామన్నా గొంతుపెగల్లేదు. తరువాత ఏమైందో తెలియదు.

కాసేపటికి పెద్ద గొంతుతో "అయ్యో! దేవుడోయ్ ! ఉన్నట్టుండి పసిగుడ్డు గుడ్లు తేలేసిందిరో!" అంటూ రాగాలు తీస్తూ నానా హంగామా చేస్తూ అందరినీ నమ్మించింది.

నమ్మలేకపోతున్నావు కదూ! నిజం చెబుతున్నాను నాన్నా! అసలు ఆడపిల్లగా పుట్టడం నా తప్పా? చేయని తప్పుకు అమ్మ కడుపులో ఉన్నన్నాళ్ళైనా నన్ను మీ ప్రపంచంలో బతకనీయపోతిరి.

పూర్తిగా కళ్ళు తెరవని నన్ను అంత కర్కశంగా చంపడానికి మీ అమ్మ మనిషా? రాక్షసా? ఏదైతేనేం నాకో పేరు, అడ్రసు లేకుండా చేశారు.

ఎందుకో ఇదంతా నీకు చెప్పాలన్పించి, చెప్పేశాను ఉంటాను మరి. నీవు చూడాలనుకున్నా నీకు కన్పించని, నీది కాని

నీ

అనామిక.

చదవడం పూర్తిచేసిన రాజేష్‌కు ఒక్కసారిగా గతం కళ్ళ ముందు గిర్రున తిరిగింది.

రెండేళ్ళ క్రితం పుట్టిన పాప నాలుగు రోజులకే ఏదో సంధి వాతంతో సహజంగానే చనిపోయిందనుకున్నాడే గానీ, తెలియని గతం తెలిశాక తల తిరిగిపోయింది.

"అన్నం వడ్డించా" నంటూ పిలుస్తున్నా వినిపించుకోకుండా- "ఆకలిగా లేదు" అంటూ ఆఫీసుకెళ్ళిన భర్తను చూస్తూ అర్థంగాక అయోమయంలో పడింది లక్ష్మి.

సాయంత్రం ఇంటికి వచ్చాక్కూడా తనకొచ్చిన ఉత్తరం గురించే ఆలోచిస్తున్నాడు రాజేష్.

"నీరసంగా కన్పిస్తున్న భర్తను చూస్తూ "భోజనం చేద్దాం రండి" అంటూ పిలుస్తున్న లక్ష్మిని ఏమీ అనలేక మౌనంగా తినొచ్చి పడుకున్నాడు.

కలత నిద్రతో తెల్లారింది.

మర్నాడుదయం ఆఫీసుకు వెళ్తూ ..."

ఆఫీసులో పని ఉంది. వీలైతే మధ్యాహ్నం వస్తాను! లేకుంటే లేదు. ఎదురు చూడకు" అంటూ వెళ్ళిపోయాడు.

గుమ్మం దాకా వచ్చిన లక్ష్మికి ఒక్కసారిగా కళ్ళు తిరిగినట్లనిపించింది. కాసేపలాగే నిల్చుని వంటకేం తొందరలేదుగా! కాసేపు పడుకుంటాను అనుకుంటూ రూంలోకి వెళ్ళిపోయింది.

ఏదో మార్పులను గమనించిన రాజమ్మ అనుమానంగా చూసింది కోడలి వైపు. అడుగుదామనుకొనేలోపే వెళ్ళి పడుకున్న కోడల్ని చూస్తూ మౌనంగా ఉండిపోయింది.

సాయంత్రం ఇల్లు చేరిన రాజేష్‌కు టీని తెచ్చిస్తూ "కొరియర్‌లో మీకేదో కవరొచ్చిందండీ! తీసుకుని షెల్ఫ్‌లో పెట్టాను"- అంది లక్ష్మి.

భార్య మాటలకొక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. గబగబా టీ తాగడం ముగించి, పరుగెత్తినంత పనిచేసి కవరందుకొన్నాడు.

నిన్నటిలాంటి కవరే!

ఫ్రమ్ 'పాప'!

చుట్టూ చూసి దాన్ని చింపుతూ మెల్లిగా మెట్లెక్కి డాబాపైకి చేరాడు.

లోపలి నుండి చిన్న ఉత్తరం జారి పడబోతుంటే వంగి గబుక్కున అందుకున్నాడు. "నాన్నా!" అన్న సంబోధన.

చివర్లో 'పాప' అన్న సంతకం! ఏమిటీ వింత? తనను 'నాన్నా' అంటూ ఈ పిలుపులేమిటీ? ఎవరీ పాప? అతని కళ్ళు అక్షరాల వెంట పరుగులు

తీశాయి.

'నాన్నా! నేను నీ పాపను! అదే– నీ రెండో పాపను! అవును! మరచిపోయాను. నన్ను నీవసలు చూడనేలేదు కదూ? నేను పాపనన్న విషయం కూడా నీకు తెలిసుండదు' ఇంకా చెప్పాలంటే –పెరగనీయకుండానే అమ్మ కడుపులోనే చిదిమేశారు. ఈ దారుణం నీకు తెలిసే అవకాశం లేదులే నాన్నా!

అంతమాత్రాన ఇందులో నీ తప్పేంలేదనుకోకు. కట్టుకున్న ఇల్లాలి పట్ల, పుట్టబోయే బిడ్డల పట్ల బాధ్యత తెలియని సగటు మనిషివి నువ్వు.

నీ తల్లిని గౌరవించు. అదే విధంగా ఆలి బాగోగులు కూడా ఓ భర్తగా చూడాల్సిన బాధ్యత నీకుందన్న విషయం మరచిపోయావు.

చదువుతున్న రాజేష్‌కు కళ్ళు బైర్లు కమ్మినంత పనైంది. కాళ్ళ వణకడంతో ఒక్కసారిగా కింద కూలబడిపోయాడు. కాసేపటికి తేరుకుని మళ్ళీ చదవసాగాడు.

రెండవసారి నెలతప్పిన అమ్మను డాక్టరు వద్దకు తీసికెళ్ళింది మీ అమ్మ. అమ్మను పరీక్షిస్తున్న డాక్టరమ్మను– నాలుగో నెలలో ఆడో,మగో తెలుస్తుందట అమ్మగారు చెప్పండి ఎవరో అంటూ అడిగింది నానమ్మ.

'అలా చెప్పడానికి చట్టం ఒప్పుకోదు'– అందావిడ.

అయినా మీ అమ్మ వదల్లేదు.

అంతగా బతిమిలాడి అడుగుతుంటే డాక్టర్‌కి జాలేసిందేమో?

"ఇంతకీ నీకెవరు కావాలని అడిగింది.

నానమ్మ ఏడ్చినంత పనిచేస్తూ "మొదట ఆడపిల్ల పుట్టి నాల్గు రోజులకే చనిపోయింది అమ్మగారు. మనవరాల్ని ఎత్తుకుని ఆడించే అదృష్టం లేదు" అంటూ కళ్ళొత్తుకుంది.

బాధపడకండి. మీ కోరిక తీరబోతోంది అంటూ వెళ్ళిపోయింది డాక్టర్.

అలా చివరకు విషయాన్ని రాబట్టగలిగింది మీ అమ్మ. తరువాత ఏం జరిగిందో ఏమో?

నాల్గురోజుల తరువాత అమ్మకు వచ్చిన కడుపు పోయింది. ఉహూ పోయేలా చేసింది మీ అమ్మ రాక్షసి.

పక్క వీధిలో ఉంటున్న నర్స్‌ను తోలుకుని వచ్చి మందులవీ ఇప్పించి సానుభూతినొలకబోస్తూ.. రాని దు:ఖాన్ని నటిస్తూ అమ్మనోదార్చింది.

అమ్మకేదో అనుమానం వచ్చింది గానీ ఏమీ అనలేని నిస్సహాయత! రుజువులు చూపించలేని అసహాయత. మౌనంగా తనలో తానే కుమిలిపోతున్నా అమ్మను చూసి అలా జరిగినందుకు బాధపడుతుందనుకున్నావు గానీ... కారణం నీ తల్లి అని గ్రహించలేకపోయావు.

ఆడదై పుట్టి మరో ఆడపిల్లను ద్వేషించడం ఇదెక్కడి న్యాయం నాన్నా! ఇకనైనా నీ భార్యను అదే... మా అమ్మను జాగ్రత్తగా కాపాడుకో! ఇంతకన్నా ఏం చెప్పగలను.

ఇట్లు,

ఉనికి ఏర్పడకుండానే ఊపిరిపోయిన నీ ఉత్తుత్తి పాప.

ఉత్తరాన్ని ముఖానికి కప్పుకుని బావురుమన్నాడు రాజేష్. కొంత సేపటికి తేరుకుని కళ్ళు తుడుచుకున్నాడు. అటూ ఇటూ చూశాడు. సాయంకాలపు చీకట్లు కమ్ముకుంటున్నాయి.

అమ్మలో ఇంత క్రూరత్వం వుందా? అమ్మకు ఆరుగురు అక్కల తరువాత తాను పుట్టడం వల్ల

ఆమెలో ఇంతటి క్రౌర్యం చోటుచేసుకుందా? కారణమేమిటి? తనకి ఎనిమిదేళ్ళ వయసులో పొలం తగాదాల్లో నాన్న, పెదనాన్న ఒకరిపై ఒకరు చేయిచేసుకోవడం.. ఆవేశంతో నాన్న పెదనాన్నను తోసేయడం అతడెళ్ళి ఓ బండరాయిపై పడటం ఫలితంగా తలపగిలి ఆయన అక్కడికక్కడే మరణించడం.. ఆ శవాన్ని ఎడ్లబండిపై తీసుకురావడం కావాలాని హత్య చేశాడంటూ పోలీసు స్టేషన్‌లో నాన్నపై ఫిర్యాదు చేయడం తనకి గుర్తుంది.

నాన్న అరెస్ట్–కేసు–విచారణ–చివరకు ఇరవైయేళ్ళ జైలు శిక్ష. అది మొదలు "అన్నను చంపి జైలుకెళ్ళినోడి పిల్లలు" అంటూ ఊళ్ళో వాళ్ళు తన కుటుంబాన్ని వెలివేసినంతగా ఈసడించుకోవడం చూసి, ఆ ఊర్లో ఎలా బతకాలో తెలియక, ఉన్న రెండెకరాలను అమ్ముకుని... మమ్మల్ని తీసుకుని దూరంగా మరో వూరు చేరుకుంది అమ్మ.

కాయకష్టం చేసి కడుపులు నింపుతున్న సమయంలో బస్తీ వాతావరణాన్ని చూసి అలా బతకాలన్న ఊహలతో తేలిపోతూ,... చిన్న, చిన్న సరదాల కోసం అడ్డదారులు తొక్కిన పెద్దక్కలు, ముగ్గురూ తలోదారిన ఇంట్లోంచి వెళ్ళిపోయారు. మిగిలిన వాళ్ళు అమ్మను నెదిరించడం మొదలుపెట్టారు.

అది గమనించిన అమ్మ గంతకుదగ్గ బొంత అన్నట్లు... అప్పటికే పెళ్ళైపోయిన రెండోపెళ్ళివాడికి ఒక అక్కనూ, పెళ్ళాం ఉన్నా పిల్లలు లేని కారణంగా మళ్ళీ పెళ్ళికి సిద్ధపడినవాడికి మరో అక్కనూ... పోలియోతో కాళ్ళు చచ్చుబడిపోయినవానికి చిన్నక్కనూ ఇచ్చి పెళ్ళిళ్ళు చేసింది.

హాస్టల్లో వంటచేస్తూ, అక్కడే తనను చేర్పించి చదివించింది. అలా డిగ్రీ పూర్తి చేయగలిగాడు. గవర్నమెంటు ఆఫీసులో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం సంపాదించుకున్నాడు.

అమ్మను పనిమాన్పించి వేరే ఇల్లు తీసుకుని ఉంటున్న సమయంలో.... ఆవేశంలో జరిగిన పొరబాటే తప్ప, మనుషుల్ని చంపే దుర్మార్గుడు కాదంటూ నాన్న సత్ప్రవర్తనను గమనించి శిక్షాకాలానికి ముందుగానే 'గాంధీ జయంతి' సందర్భంగా విడుదల చేస్తున్నారని తెలిసి అమ్మ, తను ఎంత గానో సంతోషించారు. కానీ...

ఓ రోజు జైలులో ముళ్ళకంపలను నరుకుతుండగా నాన్న పాముకాటుకు గురై మరణించడం... ఊహించని షాక్.

ఐనా అమ్మ తొందరగానే తేరుకుంది. మూడేళ్ళ క్రితం లక్ష్మితో తన వివాహం జరిపించింది. ఉన్నంతలో హాయిగా ఉంటున్నారన్న సమయంలో....

ఈ ఉత్తరాల కలకలం... నిజానికి అమ్మకు నోటి దురుసుతనం కాస్త ఎక్కువే. తన మాట నెగ్గించుకోవడానికి ఆవిడ ఆయుధమదేనని చెప్పొచ్చు. కానీ! తన బిడ్డల ద్వారా ఎదుర్కొన్న అవమానాలు అమ్మనీస్థితికి తీసుకొచ్చాయా? లేకుంటే తానొక ఆడదైయుండీ – ఆడపిల్లల పట్ల

ఇంత ద్వేషం పెంచుకొని, ఇలా విపరీత ధోరణులను ప్రదర్శించడమెంత వరకు న్యాయం?

ఆ కసి, కోపం భ్రూణ హత్యలను చేసేంతగా ఉసిగొల్పాయా?

అలాంటప్పుడు తనకు పెళ్ళెందుకు చేసినట్లు? బహుశా తనకందరూ మగపిల్లలే పుడతారనుకుందేమో? తన ఆలోచనలకు భిన్నంగా జరుగుతుంటే తట్టుకోలేక ఈ దారుణానికి పూనుకుందా?

వెంటనే లేచివెళ్ళి అడుగుదామన్నంత వెర్రి ఆవేశం వచ్చింది. అంతలోనే వివేకం అడ్డొచ్చింది.

తన పిచ్చిగానీ–అడిగినా ఒప్పుకుంటుందా? తన నోటిగాయతో వీధినీ, వాడనూ ఒక్కటి చేస్తుంది. పరువుగా బతుకుతున్న కుంటుంబాన్ని జెండాకెక్కిస్తుంది. ఈ వయసులో తల్లిని రాచి రంపాన పెడ్తున్న రాక్షసుడిగా తనపై ముద్రవేయడానికి కూడా ఏ మాత్రం వెనుకాడని తల్లి తెగింపు గుర్తొచ్చి ఆగిపోయాడు.

తన తల్లి చేసిన దుర్మార్గం తెల్సిన తన శ్రేయోభిలాషులెవరో ఇంకా కళ్ళు తెరవని పసిపిల్లల పేరుతో.. ఉత్తరాలను పంపి, తన కళ్లు తెరిపించి అప్రమత్తం చేశారు. కనిపించని ఆ మంచి మనసున్న మనిషికి మనసులోనే నమస్కరించాడు.

'ఈ దారుణం ఈ ఇంట్లో ఇక పునరావృతం కానీయను'– అనుకుంటూ డాబా దిగి కిందికి వచ్చాడు. ఆ రాత్రి భోజనం చేస్తుండగా మౌనంగా ఉన్న కొడుకుతో ఏదో మాట్లాడబోయి సీరియస్‌గా ఉన్న అతని వాలకం చూసి మౌనంగా ఉండిపోయింది రాజమ్మ. భోజనం మధ్యలో లక్ష్మి గబుక్కున లేచివెళ్ళి వాంతి చేసుకుంటుంటే, 'ఏమైంది లక్ష్మీ' అంటూ గబుక్కున లేచి వెళ్ళాడు.

రాజమ్మ కల్పించుకుని "మళ్ళీ నెల తప్పినట్లుందేమోనన్పిస్తోందిరా! రేపు డాక్టరు గారి వద్దకు తీసుకెళ్తాను.. విషయం తెలుస్తుంది.. అంది పెద్దరికంతో.

ప్రశ్నార్థకంగా భార్య ముఖంలోకి చూసిన రాజేష్‌కి ఆమె వాలకం చూశాక విషయం అర్థమైంది.

మెల్లిగా ఆమెను తీసుకొచ్చి తాగడానికి నీళ్ళిచ్చి "లక్ష్మీ! నేను పాలు కాచి తెస్తాను. తాగి పడుకో!" అంటూ బెడ్‌రూంలోకి తీసుకెళ్ళాడు.

ఎన్నడూ చూడని తీరులో కొడుకు ప్రవర్తన చూసి ఆశ్చర్యపోయింది రాజమ్మ. తెల్లవారింది.

తల్లి వారిస్తున్నా వినకుండా సెలవు పెట్టి భార్యను ప్రైవేటు నర్సింగ్‌హోమ్‌కు తీసుకెళ్ళి పరీక్షలు చేయించాడు.

"మూడు నెలలు నిండాయి. కానీ చాలా బలహీనంగా వుంది. సాధ్యమైనంత వరకు బెడ్‌రెస్ట్‌లోనే ఉండాలి. బలమైన ఆహారం, పండ్లు తినిపించండి. మరో నెల పోయాక రండి" అంటూ మందులు రాసిచ్చింది డాక్టరు.

ఆటోలో ఇల్లు చేరి తల్లికి విషయం చెప్పాడు. నిర్లిప్తంగా విని ఊరుకుంది. కోడలితో తనను వెళ్ళనీయనందుకు మనసులో కోపంగా ఉందామెకు. రాత్రి భోజనాల సమయంలో తల్లి వినేలా భార్యతో "లక్ష్మీ బట్టలవీ సర్దుకో! రేపొద్దున ప్రయాణం. ఇంతకు ముందే అత్తయ్య మావయ్యకు నిన్ను తీసుకొస్తున్నాననీ, నీకు పురుడు వచ్చేవరకు నీవక్కడే ఉంటావనీ ఫోన్ చేశాను. వాళ్ళెంత సంతోషించారో తెలుసా? అక్కడే ఉండి హాయిగా రెస్ట్ తీసుకో. వీలున్నప్పుడల్లా నేనొచ్చి వెళుతుంటాను. సరేనా?" అన్నాడు ప్రేమగా.

"అత్తయ్యకూ మీకు ఇబ్బంది అవుతుందేమోనండీ! అంటూ నసిగింది. "లక్ష్మీ నేనున్నాను గదా! జాగ్రత్తగా చూసుకుంటాను." అంటూ భరోసా ఇచ్చాడు. తల్లి వారిస్తున్నా వినకుండా మర్నాడు ఉదయం భార్యను తీసుకుని బయలుదేరాడు.

బస్సులో కిటికీ పక్కన కూర్చున్న లక్ష్మికి బయట నుండి వీస్తున్న చల్లగాలి ఎంతో సాంత్వననీ, హాయినీ కలిస్తోంది. తృప్తిగా కళ్ళు మూసుకుంది గతం కళ్ళముందు కదలసాగింది. తమ వీధిలో నాలుగిళ్ళవతల ఉంటున్న మణెమ్మగారు వైభవ లక్ష్మీ వ్రత ఉద్యాపన ఉందనీ, వాయనము తీసుకోవడానికి రమ్మని పిలవడం, వెళ్ళిన లక్ష్మికి అక్కడ ఇంటర్‌లో క్లాస్‌మేట్ వాణి కన్పించింది. చాలా రోజుల తరువాత కలుసుకున్న వాళ్లు చాలా సేపు కబుర్లు చెప్పుకుని, మళ్ళీ కలుసుకోవడానికి వీలుగా ఫోన్ నంబర్లు తీసుకున్నారు.

తరువాత రెండు రోజులకనుకుంటా లక్ష్మి ఫోన్ చేసింది. ఎన్నో విషయాలు మాట్లాడుకొన్నాకా....

"ఒకప్పుడు "కథ రాశాను వినండి" అంటూ కాలేజీలో మేము వినేదాకా, మా అభిప్రాయాల్ని చెప్పేదాకా మమ్మల్ని వేధించేదానివి ఇంకా రాస్తున్నావా? ఎన్ని బహుమతులను కొట్టేశావేంటి"? అని అడిగింది వాణిని.

"ఏదో రాస్తున్నాను లేవే! ఆడపాదడపా పత్రికల్లో అచ్చవుతున్నాయి. కొద్దో గొప్పో పారితోషికం కూడా అందుతుంది" అంటూ చెప్పి నవ్వింది.

తరువాత లక్ష్మి గురించి అడిగింది. చివరకు కన్నతల్లితో కూడా చెప్పకుండా మనసులో దాచుకున్న బడబాగ్నిని బయటపెడుతూ ఫోన్‌లోనే ఏడ్చినంత పనిచేసింది.

మళ్ళీ నెల తప్పిన సంగతి చెప్తూ "ఈసారి కూడా ఏమవుతుందోనని భయంగా ఉంది వాణీ" అని అంటుంటే... "నువ్వేం భయపడకు లక్ష్మీ! నేనంతా చూసుకుంటాను. నీకేం కాదు నిశ్చింతగా ఉండు అంటూ తన ఇంటి అడ్రస్ అడిగి, ఫోన్ పెట్టేసింది.

కథలు రాసే వాణిని ఏడిపించడమే తెలుసుకానీ, ఆ రాతలు ఇంత పవర్‌ఫుల్‌గా తన బతుకు గీతల్ని చక్కదిద్దుతాయన్న ఆలోచన ఏ మాత్రమైనా తన ఊహకందలేదు కదా! అని ఆలోచిస్తూ.

"థ్యాంక్యూ వాణీ! నువ్వు నీ కలం బలం చూపించి నా కడుపు పంటను కాపాడావు! ఈసారి నాకు ఆడపిల్ల అంటూ పుడితే నీ పేరే పెట్టి నీ రుణం తీర్చుకుంటాను" అని అనుకుంటూ.. ఎప్పుడూ లేనంత నిశ్చింతగా భర్త భుజంపై తలవాల్చింది.

✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతి రాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

<u>మెయిల్ అడ్రస్:</u>

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

రొయ్యల కూర



కావాల్సిన పదార్థాలు

పచ్చి రొయ్యలు-1/2 కేజీ (శుభ్రం చేసి పసుపు ఉప్పు కలిపి పక్కకు పెట్టాలి)

ఉల్లిపాయలు-2

పచ్చిమిర్చి-5

అల్లం వెల్లుల్ల పేస్టు-2 చెంచాలు

చిటికెడు పసుపు

కారం- 4 చెంచాలు

ధనియాల పొడి-1 చెంచా

మసాలా పొడి- 1 చెంచా

నూనె- తగినంత

ఉప్పు- తగినంత

కొత్తిమీర - ఒక కట్ట

తయారీ

మామిడికాయను మెత్తగా పేస్టు చేసుకోవాలి. గిన్నెలో నూనె వేసి కాగాక మొదట సన్నగా తరిగిన ఉల్లి పాయలు, పచ్చిమిర్చి వేసి అవి వేగాక అల్లం, వెల్లుల్లి పేస్టు వేసి సన్న మంట మీద వేగనివ్వాలి. తరువాత రొయ్యలు వేసి బాగా వేగాక మామిడి కాయ గుజ్జు కూడా వేసి ఉప్పు, కారం, ధనియాల పొడి, మసాలా పొడి వేసి నీరంతా ఇంకిపోయాక కొత్తిమీర వేసి దించాలి.

మామిడితో నాన్-వెజ్ మజా

మటన్

బోన్‌లెస్ మటన్- అర కేజీ

మామిడికాయ- 1

ఉల్లిపాయలు-2

పచ్చిమిర్చి-5

అల్లం వెల్లుల్లి పేస్టు- రెండు చెంచాలు

పసుపు- చిటికెడు

ధనియాల పొడి- ఒక చెంచా

మసాలా పొడి- ఒక చెంచా

ఉప్పు- తగినంత

కొత్తిమీర- ఒకటి

తయారీ

ముందుగా మటన్ శుభ్రం చేసుకుని ఉప్పు పసుపు వేసి ఉడికించుకోవాలి. మామిడి కాయని చెక్కుతీసి ముక్కలు చేసి మిక్సీలో వేసుకోవాలి. మూకుడులో నూనె వేసి ఉల్లిపాయ ముక్కలు పచ్చిమిర్చి వేసి వేగాక ఉడికించిన మటన్ వేసి మరో 5,6 నిమిషాలు మగ్గనివ్వాలి. తరువాత మామిడి కాయ గుజ్జు వేసి ధనియాల పొడి, కారం, ఉప్పు, మసాలా పొడి వేసి బాగా దగ్గరకు అయ్యే వరకు స్టౌ మీద ఉంచి కొత్తిమీర వేశాక స్టౌ మీద నుంచి దించాలి.

చేపల కూర

కావాల్సిన పదార్థాలు

మామిడి కాయ- ఒకటి

శుభ్రం చేసిన చేప ముక్కలు- 1/2 కిలో

ఉల్లిపాయలు- రెండు (పేస్టు)

పచ్చి మిర్చి-ఐదు

అల్లం వెల్లుల్లి పేస్టు- రెండు చెంచాలు

కొత్తిమీర కట్ట- ఒకటి

ఉప్పు- తగినంత

నూనె- 1/4 కప్పు

మసాలా పొడి-ఒక చెంచా

తయారీ

చేప ముక్కలకు ఉప్పు, పసుపు, కారం వెల్లుల్లి, అల్లం పేస్ట్ పట్టించి ఒక గంట పక్కకు పెట్టాలి. మామిడికాయ చెక్కు తీసి ముక్కలు కోసుకుని పేస్టులా చేసి పెట్టుకోవాలి. వెడల్పాటి గిన్నెలో నూనె వేసి వేడెక్కిన తరువాత ఉల్లిపాయ పేస్టు వేసి వేయించాలి. అది దోరగా వేగాక అల్లం-వెల్లుల్లి పేస్టు పచ్చి మిరపకాయ, కారం వేసి వేగిన తరువాత చేప ముక్కలు వేసుకోవాలి. ముక్కల్ని చిదమకుండా ఇరువైపులా వేయించాలి. ఉప్పు, మామిడి కాయ గుజ్జు వేసి దగ్గరగా అయ్యాక ఉప్పు మసాలా పొడి వేసి మరో రెండు నిమిషాలు ఉడికించి దించాలి. పైన కొత్తిమీర అలంకరించి వేడి వేడి అన్నంలోకి వడ్డించండి.

దారి ఏది?

ఈ చిట్టి ఎలుకకు ఎదురుగా మూడు దారులున్నాయి. వాటిలో సరైన దారిని ఎన్నుకుంటే తనకెంతో ఇష్టమైన జున్ను ముక్కను చేరుకుంటుంది. లేకుంటే బోనులోకే. జున్ను తినేందుకు కావాల్సిన దారిని చూపిస్తారు కదూ.



బొమ్మను గీద్దాం

ఈ వారం ఆర్టిస్టు అంకుల్ జిగ్లీ పఫ్ అనే కామిక్ బొమ్మను ఎలా గీయాలో నేర్పుతాడు. నేర్చుకోండే.



ఏవి... ఎన్ని...

ఏనుగు చిత్రంలో బోలెడన్ని జంతువులు దాగి ఉన్నాయి. ఇంతకీ వాటి పేర్లేంటి? అవి ఎన్ని వున్నాయి? లెక్కించి చెప్పండే.



నీడను గుర్తించండి

ఈ చిత్రంలోని యుద్ధ వీరులు తమ నీడను గుర్తించుకోలేక ఒకరొకరితో పోటీ పడుతున్నారు. ఇంతకీ ఎవరి నీడ ఏదో గుర్తించండి.



నాన్న కనిపించాడా

అదో అందమైన పల్లెటూరు. ఊరి చివర ఓ ఇల్లు. ఆ ఇంట్లో ఓ కుటుంబం. ఆ చిన్నారికి బొమ్మలేయడమంటే చాలా ఇష్టం. ఎంచక్కా ఇంటి బయట కూర్చుని కొండల మధ్యన వున్న తమ ఇంటి బొమ్మ గీశాడు. అది వాళ్ల నాన్న చూసి తెగ మురిసిపోయాడు. ఇంతకీ నాన్న కనిపించాడా?!

జవాబు: ఈ పుస్తకాన్ని దూరంగా పెట్టుకుని చూడండి. నాన్న తల కనిపిస్తుంది.

పదాలు పూరించండి

ఈ చిత్రంలో 9 బొమ్మలున్నాయి. వాటి ఇంగ్లీషు పేర్లలో కొన్ని అక్షరాలు మిస్సయ్యాయి. వాటిని కలిపితే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా సరైన అక్షరాలను నింపేయండి మరి.



జవాబులు:
o,g,c,q&e,r,o&n,o,i,a&l

పిల్లల పెద్ద పాదాలు



నేస్తాలూ... అప్పుడప్పుడు...మీకంటే పెద్ద వాళ్ల చెప్పులు వేసుకోవాలనిపిస్తుంది కదూ. వాటిని వేసుకుని... మీ చిట్టి పాదాలు కూడా అంత పెద్దవైపోయినట్టు మురిసిపోతుంటారు కూడా. అమ్మానాన్నలకి, నేస్తాలకి చూపించి బోలెడంత సంతోషపడిపోతుంటారు. అయితే భారీ పాదాలను ...ఇంట్లో దొరికే వస్తువులతోనే తయారు చేసుకోవచ్చు.

కావాల్సినవి

కార్డుబోర్డు/థర్మాకోల్ షీటు, మార్కర్/ స్కెచ్ పెన్, కత్తెర, 4 లేసులు/ పైప్ క్లీనర్స్

తయారుచేసే విధానం

ముందుగా కార్డ్‌బోర్డు షీటు తీసుకుని దానిమీద పెద్ద పాదాలను గీసుకోవాలి. మోడల్‌గా అన్నయ్యనో, అమ్మనో నిలబడమనొచ్చు. ఇప్పుడు ఇంకో కార్డ్‌బోర్డు షీటుపై ముందుగా గీసుకున్న పాదం నమూనాతో అదే ఆకారంలో మార్క్ చేసుకోవాలి. వీటిని సరిగ్గా పాదం ఆకారంలో కత్తిరించుకోవాలి. అలా కత్తిరించిన పెద్ద పాదాలలో మీ చిట్టి పాదాలు ఇమిడేలా నాలుగు రంధ్రాలు చేసుకోవాలి. రెండు లేసులు తీసుకుని రంధ్రాల ద్వారా పైకితెచ్చి ఉంచుకోవాలి. ఇప్పుడు మీ పాదాలను అందులో పెట్టి వెనుక నుండి లేసుతో కట్టేయండి. అంతే! ఇక బుజ్జాయిలకు పెద్ద పాదాలు వచ్చేసినట్లే!



పద వికాసం - 4

కూర్పు: టి.డి. ప్రసాద్

1	2	3	4		5	✿	6	7	✿
8				✿	9	10	✿	11	
	✿		✿	12	✿	13	14		✿
✿	15	✿	16	✿	17			✿	18
19		20	✿	21			✿	22	✿
23			24		✿	25	26	✿	27
✿		✿		✿	28	✿	29	30	
31	✿	32	✿	33	✿	34			
35	36	✿	37		✿	38		✿	
✿	39		✿	40			✿	41	

ఆధారాలు

1. సంపద+దారిద్ర్యం (6)
6. ఉష్ణం, కోపం (2)
8. పట్టణము, పురము (4)
9. రథం, బండి (2)
11. అటు నుంచి కూలిపోవు (2)
12. ఆంగ్లంలో వెళ్లు (1)
13. శ్వేతం, తెలియజేయు (3)
16. అడ్డం 12తో ఆవు (1)
17. తిరగబడిన తాలింపు గింజలు (3)
18. అడ్డం 28తో కలిపితే దోసె (1)
19. లేఖలు, ఉద్యోగాలు (3)
21. ఈ వేగుకు వ్యతిరేకం (3)
22. అడ్డం 32తో చేప (1)
23. నకలు రాయడం రాదనక్కు 1,2,7,4,10 (5)
25. తారుమారైన మాలు (2)
28. తెలుగు అక్షరమాల దీనితోనే ప్రారంభం (1)
29. కుడివైపు నుంచి షి ఉన్నకారు (3)
32. గడలేని మీగడ (1)
34. ప్లాను (4)
35. వస్త్రం (2)
37. దిగులు (2)
38. నడిచేందుకు సాయపడే అవయవం (2)
39. గుహ, రంధ్రం (2)
40. తిరగబడిన శంఖాలు (3)
41. గుళిక (2)

నిలువు

1. బంగారం (3)
2. రజనీకాంత్, అనుష్క, రవిశంకర్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రంలో సున్నా ఎగిరిపోయింది (2)
3. కారం కాయలు (3)
4. లేమని చెప్పండి (2)
5. శీర్షాసనం వేసిన తేలు (2)
7. పొలంలో పెరిగే పనికిరాని మొక్కలు (3)
10. తెలుగువారు - 5,1,4,3,2, (5)
14. పైకి ఎదిగిన బంగాళదుంప (2)
15. నక్క (4)
17. వేలు పైకి (2)
19. చేతి బొటనవేలికి, మధ్య వేలికి నడుమ దూరం (2)
20. కింది నుంచి రాలు (2)
21. చెట్టుకు ఉండే పత్రం (2)
24. నక్షత్రాలు ఎప్పుడు కనిపిస్తాయి? (2)
26. మీరుణాలకు వ్యతిరేకం (4)
27. ఎలుకలకు స్నేహితుడు (5)
30. మహాకవి --దాసు (2)
31. కాయపై మచ్చ (2)
33. రాత్రి కాదు (3)
34. వెలుగు, ఓ జిల్లా పేరు (3)
36. తలకిందులైన శిశువు (2)

సుడోకు

ప్రతి నిలువు, అడ్డం వరుసల్లో 1 నుంచి 9 అంకెలతో పూరించాలి. వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ఒక్కో 3ల3 గడిల్లో కూడా రిపీట్ కాకుండా 1 నుంచి 9 అంకెల్ని నింపాలి.

	9		2					
4				8				1
		8			5		7	
	5		3			7		
9				4				8
		1			9		3	
	1		7			2		
3				1				4
					8		5	

గతవారం జవాబు

1 రా	క	2 బో	3 క	లు	✿	4 సం	త	5 కం	✿
క్ష	✿	6 క	ల	✿	7 మా	త	✿	8 ద	9 గా
10 ప	గ	డా	లు	✿	11 మా	సం	12 మా	✿	సు
తి	✿	✿	13 క	సు	✿	✿	14 జీ	15 లు	గ
✿	16 క	థ	నం	✿	17 అ	త్త	✿	క్షా	✿
18 రా	ట్నం	✿	19 డి	20 సెం	బ	✿	21 ది	వా	22 సు
యి	✿	23 నీ	✿	24 చా	ల	25 క	✿	26 గ	డి
✿	27 జ	✿	28 నం	✿	✿	29 కొ	30 రు	✿	కొ
31 లా	వా	✿	32 ది	33 శ	34 గా	✿	35 ఆ	36 కొ	రం
37 కు	సు	కు	✿	38 త	రం	గం	✿	జా	✿

డిజైనర్ ట్యాక్సీలు

ఇక్కడ ఆటోలు.. ముంబైలో ట్యాక్సీలు.. మిగతాదంతా సేమ్ టు సేమ్. ప్రయాణాల్లో దేశ రాజకీయాలపై చర్చలు.. కొత్త సినిమాపై డ్రైవర్ రివ్యూలు.. మారుతున్న ఊరుపై సెటైర్లు.. దారి మలుపులో ఎదురయ్యే ప్లేస్ గురించో, వ్యక్తి గురించో గాసిప్పులు. అయితే ఆటోలన్నీ, ట్యాక్సీలన్నీ నడిపే రూట్లలా సేమ్ టు సేమ్ ఉండవు. ఎల్ఈడీ కాంతులతో టైర్ల నుంచి స్టీరింగ్‌ల వరకు ధగధగలాడించేవి ఉంటాయి. హీరోయిన్లు, హీరోలతో సీట్ల నుంచి టాప్ వరకు స్టిక్కరింగ్ అయ్యే ఉంటాయి. మిగతా వాటికన్నా రూటే సెపరేట్‌గా ఉండాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు గాడీవాలాలు. అయితే మార్కెట్లో దొరికే అలంకరణలన్నీ సేమ్ టు సేమ్ ఉండటంతో మళ్లీ అన్నీ ఒకేలా యాక్సెసరీలను అద్దుకుంటాయి. అందుకే ఓ కొత్త ఆలోచనతో వచ్చారు 'ట్యాక్సీ ఫ్యాబ్రిక్ ప్రాజెక్ట్' కళాకారులు. ముంబై ట్యాక్సీల ఇంటీరియర్లపై థీమాటిక్ ఎక్స్‌ప్రెషన్స్‌తో డిజైన్లు వేసేస్తున్నారు. ముంబైలోని యూనిక్‌నెస్‌లోని వైవిధ్యాల్ని కళ్లకు కట్టేలా మొత్తానికే మొత్తం ట్యాక్సీని వర్ణచిత్రమయం చేస్తున్నారు. డబ్బావాలాల పని విధానం నుంచి వేళ్లూనుకున్న కాంక్రీట్ జంగిల్ వరకు, క్విట్ ఇండియా ఉద్యమం ప్రేరణ నుంచి, ముంబై నైట్ లైఫ్ వరకు ఒక్కో థీమ్‌ను ఒక్కో ట్యాక్సీకి అదనం చేసేస్తున్నారు. పాతికేళ్ల ఔత్సాహిక డిజైనర్ పవిత్ర దీక్షిత్, తల పండిన ఆర్ట్ డైరెక్టర్ సంకేత్ అవ్లానీ వంటి వాళ్లు డిజైనర్ ట్యాక్సీల్ని తీర్చిదిద్దుతున్న జట్టులో ఉన్నారు. పబ్లిక్‌లో తమ కళను ప్రదర్శించడానికి ఇదో మంచి కేన్వాసే కాక వేదికగాను ఉంటోందని ఆర్టిస్టులు చొరవ చూపుతున్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో ఈ ట్యాక్సీలు ముంబై వీధుల్లో తిరుగుతున్నాయి. కాసేపు కాలక్షేపపు కబుర్లు పక్కనబెట్టి మరీ... ఆ ఆర్ట్‌ను ఎవరు వేశారని, ఎలా ఈ ఐడియా వచ్చిందని ప్రయాణీకులు అడుగుతున్నారని ట్యాక్సీవాలాలు చెబుతున్నారు. డిజైన్లు మరీ ముద్దొచ్చేసి మీటర్ మీద కన్నా కాస్త ఎక్కువ పైసలిస్తున్నారట కూడా.






బుక్‌స్టోర్ నిద్రలు

స్కాట్లాండ్‌లో ఓ ఊరంటే చదువరులకు పసందైన విందు. ఆ దేశ జాతీయ పుస్తక పట్టణంగా పేరు తెచ్చుకున్న అందమైన ఆ ఊరే విగ్‌టౌన్. ముఖ్యంగా సెకండ్ హ్యాండ్ పుస్తకాల షాపులతో అది నిండి ఉంటుంది. ఆ విశేషంతోపాటు చారిత్రాత్మక ప్రదేశంగాను గుర్తింపు ఉందా ఊరుకి. 13వ శతాబ్దికి చెందిన కేజిల్ చూపుతిప్పుకోనివ్వదు. 'టూ గేట్స్' అని పిలవబడే రెండు పోర్టులు, సముద్ర తీరం అద్భుతంగా ఉంటాయి. అసలు ఈ ఊరు చుట్టూ ప్రాంతమంతా ప్రాచీన కాలానికి గురుతులతో నిండి ఉంటుంది. నియోలిథిక్ (రాతి యుగం) నాటి 'టోరెహౌసెకీ స్టాండింగ్ స్టోన్ సర్కిల్' అందులో ఒకటి. చరిత్రకారులకు, పరిశోధకులకు ముఖ్య కేంద్రం. అలాంటి ఎన్నో ప్రత్యేకతలున్న విగ్‌టౌన్‌లో అదీ విలాసవంతమైన ఫ్లాట్‌లో గడిపే అవకాశం టూరిస్ట్‌లకో, పని మీద వెళ్లేవారికి రోజు(రాత్రి)కి కేవలం రూ.3600లకే వస్తే.. గిల్లి చూసుకుంటారు. అక్కడి లెక్కల్లో అది వెరీ వెరీ చీపండి. జోక్ చేస్తున్నారని లేదా ఏదో మతలబుందని ఆఫర్‌ను పట్టించుకోను కూడా కోరు. కానీ, ఇది నిజమంటూ ఎయిర్‌బీఎన్‌బీ అనే ఆతిథ్య సంస్థ అంటోంది. విగ్‌టౌన్‌లోని 2 హై స్ట్రీట్ అనే ప్రధాన వీధి కార్నర్‌లో ఉన్న డీజీ8 9హెచ్‌క్యూ చిరునామాతో ఉండే ఈ పుస్తకాల లాడ్జి పేరు 'ది ఓపెన్ బుక్‌స్టోర్'. కాకపోతే ఆ ఫ్లాట్ కింద ఉండే బుక్‌స్టోర్‌ను నడపాలి. అదీ వారంలో ఓ 40 గంటలు. కావాలంటే ఆ వారంలో ఒకటి, రెండు రోజులు స్టోర్‌ను మూసేయొచ్చు.



అలా చేస్తే రోజులో 8 గంటలపాటు పుస్తకాల కుస్తీలు పడాల్సి ఉంటుంది. అయితే ఎప్పటి నుంచి ఎప్పటి వరకు, ఏయే గంటల్లో తెరిచి ఉంచొచ్చనేదీ అతిథుల ఇష్టమే. ఈ అవకాశం పుస్తకాల పురుగులకు రావాలి గానీ వరస పెట్టున మూడు నాలుగు రోజుల్లో పుస్తకాల లోకంలో పడి పని పూర్తిచేసేయరూ!.. మిగతా సగం వారం ఎంజాయ్ చేసేయరు. కొన్ని రోజుల పాటు పుస్తకాల కొట్టును నడిపిన సరదా కూడా తీరుతుంది. ఇప్పుడు చెప్పండి ఇది మంచి ఆఫరే కదూ.



Check List

Book Number	KNSR02B111	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29